# 20 ఫీట్లకు చేరిన కోయిల్‌సాగర్ నీటిమట్టం..

● కోయిలకొండ,అంకిళ్ల వాగుల నుండి వచ్చి చేరుతున్న నీరు

● కొనసాగుతున్న ప్రాజెక్టులోకి కృష్ణ జలాల తరలింపు

**దేవరకద్ర,జులై 21 ప్రభాతవార్త:** జిల్లాలోని భారీ నీటిపారుదల ప్రాజెక్టు కోయిల్‌సాగర్‌లో రోజురోజుకు నీటిమట్టం పెరుగుతుంది. తీలేర్ పంప్‌హౌజ్ నుండి 1 మోటర్ ద్వారా బుధ వారం కృష్ణ జలాలను కోయిల్‌సాగర్‌కు తరలించారు.దీంతో కోయిల్‌సాగర్ వైపు కృష్ణమ్మ పరుగులు పెడుతుంది.అలాగే వర్షాలు కురుస్తుండటంతో కోయిలకొండ,అంకిళ్ల వాగుల నుండి ప్రాజెక్టులోకి నీరు వచ్చి చేరడం ప్రారంభమైంది.శుక్రవారం సాయంత్రం నాటికి ప్రాజెక్టులో నీటిమట్టం 20 ఫీట్లకు చేరింది. కోయిల్‌సాగర్ ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ స్థోమత 32.5 ఫీట్లు. ఇంకా 22.5 ఫీట్ల మేర నీరు వచ్చి చేరితే ప్రాజెక్టు షెట్టర్లను తెరుస్తారు. ప్రాజెక్టులోకి కొత్త నీరు వచ్చి చేరుతుండటంలో కోయిల్ సాగర్‌కు జలకళ వస్తుంది. ప్రాజెక్టును చూడటానికి వచ్చే పర్యాటకుల సంఖ్య కూడ క్రమేపి పెరుతుంది.

# శక్తివంతంగా బీఆర్ఎస్ ప్రభుత్వం....

**- నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి,జూలై 21 ప్రభాతవార్త:**నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ మరింత శక్తి వంతంగా మారిందని నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి అన్నారు. నియోజ కవర్గం లోని ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్ పార్టీలో వలసలు జోరుగా పెరిగాయని ఆయన పేర్కొన్నారు. బిజినపల్లి మండలం గౌరారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ హసీనాబేగం,ఉపసర్పంచ్ తయ్యాబ్‌తో పాటు పలువురు సభ్యులు ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి సమక్షంలో హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఉనికి లేకుండా పోయిందని, నాగర్‌కర్నూల్‌లో కాంగ్రెస్ పార్టీ గెలిచే అవకాశం కనిపించడం లేదని, దీంతో బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. నాగర్‌కర్నూల్‌లో ఈ సారి ఎన్నికల్లో మూడోసారి గులాభి జెండా ఎగురడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఉనికి రోజు రోజుకు పడిపోతుందన్నారు. ప్రభుత్వ పనితీరు చూసి పార్టీలో వలసలు పెరిగాయన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో తిరిగి బీఆర్ఎస్ పార్టీ విజయఢంకా మోగిస్తుందన్నారు. గతంలో కన్న ఈ సారి నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ మరింత బలోపేతంగా ఉందన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చిన దాదాపు 50వేల మెజార్టీతో నాగర్‌కర్నూల్‌లో గులాభి జెండా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఎవరెన్ని కుట్రలు, విమర్శలు చేసిన ప్రజలు సీఎం కేసీఆర్ వైపు ఉన్నారన్నారు. పార్టీలో చేరిన వారు గుంత కృష్ణ, ఎండీ.మహబూబ్‌అలీ, ఎండీ. ఖుతుబ్, మొల్ల జహంగీర్, బురాన్‌లతో పాటు పలువురు ఉన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు తదితరులు ఉన్నారు.



పార్టీలో చేరిన నాయకులతో ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి

# పోక్సో కేసులో నిందితుడికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష..

**రూ.20 వేల జరిమానా విధింపు**

**నారాయణపేట ప్రతినిధి,జులై 21 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ రఫీ నేరస్తుడైన దాసరి శివశంకర్ తండ్రి పేరు దాసరి భగవాన్‌దాస్ (26) ఎల్లిగండ్ల గ్రామం, మరికల్ మండలానికి చెందిన వ్యక్తిపై నేర నిరూపణ అయినందున 10 సంవత్సరాల జైలుశిక్షతో పాటు 20 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. కేసు పూర్వాపరాలు పరిశీలించగా మార్చి 18, 2020 సంవత్సరంలో ఎలిగండ్ల గ్రామానికి చెందిన మైనర్ బాలికలు మరికల్ పిఎస్‌లో పై నేరస్తుడు ప్రేమిస్తున్నానని నమ్మించి శారీరకంగా వాడుకున్నాడని, పెళ్లి చేసుకోమంటే చేసుకోవడం లేదనే ఫిర్యాదుపై అప్పటి ఎస్సై నాసర్ ప్రస్తుతం ఇన్స్‌పెక్టర్ ఇంటెలిజెన్స్ నారాయణపేట ఎఫ్ఐఆర్ జారీచేయగా ఎండి ఇఫ్తెకార్ అహ్మద్, సిఐ మరికల్ ప్రస్తుత ఇన్స్‌పెక్టర్ సిసిఎస్ మహబూబ్‌నగర్ కేసును పరిశోధించారు. టి. శివకుమార్ సిఐ మరికల్ ప్రస్తుతం, ఎస్బిఐ గద్వాల కేసులో చార్జిషీటు ఫైల్ చేయగా, ఎస్. మురళీకృష్ణ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ 11 మంది సాక్షులను కోర్టులో హాజరు పరిచారు. ప్రస్తుత మరికల్ ఎస్సై హరిప్రసాద్‌రెడ్డి,బాలకృష్ణ ఎఎస్సై, పోలీస్ కోర్టు లైజన్ ఆఫీసర్, విజయకుమార్ సిసి, సాక్షులను తర్ఫీదు చేసి పిపి సమక్షంలో ప్రవేశపెట్టారు. కోర్టు డ్యూటీ ఆఫీసర్ వీరప్ప, జాకబ్ జాన్సన్ పిపి మరికల్ సాక్షులను కోర్టులో పరిచారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎన్. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నేరస్తుడికి శిక్ష పడడంతో బాగాపని చేసిన అడిషనల్ పిపి, పోలీస్ అధికారులను ఎస్పీ అభినందించారు.



జిల్లా ఎస్పీ వెంకటేశ్వర్లు

## రైతులు విత్తనాలు వెదజల్లే పద్ధతి చేసుకుంటే

# ఎక్కువ పంట, ఎక్కువ ఆదాయం వచ్చే అవకాశం

**గద్వాల జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి**

**గద్వాల ప్రతినిధి,జులై 21 ప్రభాతవార్త :** జిల్లాలో రైతులు విత్తనాలు వెదజల్లే పద్దతి చేసుకుంటే తక్కువ లేబర్‌తో ఎక్కువ పంట, ఆదాయం వచ్చే అవకాశముందని ఖరీఫ్ పంట సాగు చేసుకోవాలని, జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ ఐడిఓసి సమావేశం హాలులో విలేఖరులతో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 2023 నెలలో వర్షపాతం సాధారణంగా ఉందని, జూన్ నెలలో సాధారణ వర్షపాతం కంటే 23 శాతం వర్షపాతం తక్కువగా నమోదైందని అన్నారు. జులై నెలలో 73.9 మి.మీ. వర్షపాతం కురవాల్సి ఉండగా, ఇప్పటివరకు 52.8 శాతం మాత్రమే కురిసిందని, ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల వర్షపాతం లోటులేదని అన్నారు. గత సంవత్సరంలో 1,75,700ల ఎకరాలలో సాగు విస్తీర్ణం జరిగిందని, ఈ సంవత్సరం జులై నెలలో 28.6 మీ.మీ. వర్షపాతం నమోదైందని, వ్యవసాయ అధికారుల సూచనల మేరకు పంటలు సాగు చేయాలని, రైతులు జులై నాటికి 1.75 లక్షల ఎకరాలు రైతులు వివిధ పంటలు సాగు చేశారని, అయితే ఈ సంవత్సరం వర్షాలు ఆలస్యం కావడంతో ఇప్పటివరకు 83 వేల ఎకరాల్లో మాత్రమే రైతులు పంటలు సాగు చేశారని అన్నారు. జులై 31 వరకు అనవైన పంటలు వరి,మొక్కజొన్న, సజ్జలు,రాగి, కొర్ర, కందులు స్వల్పకాలిక వ్యవధిలో పండే వేరుశనగ, ఆముదం, పొద్దుతిరుగుడు, ఎర్ర మిరపపంటలు సాగు చేసుకోవాలని సూచించారు. నకిలీ విత్తనాల వల్ల పంటల్లో నష్టం వాటిల్లిందని తెలిస్తే కంపెనీలపై చర్యలు తీసుకుంటామని, పంటలు నష్టపోయిన వాటిపై సమగ్ర విచారణ జరిపి తగిన పరిష్కారం చేస్తామని తెలిపారు. రైతులందరికి ఎటువంటి సమస్యలు ఉన్న వ్యవసాయ విస్తరణ అదికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. అదేవిధంగా భారీవర్షాల కారణంగా జిలాల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పాతబడిన ఇండ్లలో ఉన్న వారందరిని సురక్షిత ప్రాంతాలలో ఉండే విధంగా చూడాలని పంచాయతీ సెక్రెటరీలకు, మున్సిపల్ కమిషన్‌ర్‌లను ఆదేశించడం జరిగిందని తెలిపారు. వర్షాకాలం పిడుగులు పడేటప్పుడు ప్రజలు బహిరంగ ప్రదేశాలలో, చెట్ల కింద ఉండరాదని సూచించారు. సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలందరు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్‌తో పాటు వ్యవసాయ అధికారి గోవిందునాయక్, ప్రింట్ ఎలక్ట్రానిక్ రిపోర్టర్లు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

# వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలి..

**బిజెపి పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణ భరతసింహారెడ్డి**

**గద్వాల ప్రతినిధి,జులై 21 ప్రభాతవార్త :** వాల్మీకి బోయ సంఘాల ఐక్యకార్యాచరణ కమిటి సభ్యుల ఆధ్వర్యంలో వాల్మీకి నాయకులు హైదరాబాద్ బిజెపి పార్టీ కార్యాలయంలో భారతీయ జనతా పార్టీ నూతన అధ్యక్షుడుగా బాధ్యతలు చేపట్టిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి రాజ్యసభ సభ్యులు, ఓబిసి మోర్చా జాతీయ అధ్యక్షుడు డా.కె. లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో వాల్మీకి బోయ ఎస్టీ జాబితా బిల్లు అసెంబ్లీ తీర్మాణం చేసి కేంద్రానికి పంపింది. కేంద్ర ప్రభుత్వం పరిధిలో ఉన్నందున పార్లమెంటులో ఈ బిల్లును తీర్మాణం చేయించి వాల్మీకి బోయల ఎస్టీ జాబితాలో చేర్చే విధంగా చూడాలని కోరారు.



వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

# ఎమ్మెల్యేను సన్మానించిన కుర్తిరావుల చెరువు మైనార్టీ నాయకులు

**గద్వాల ప్రతినిధి, జులై 21 ప్రభాతవార్త :** గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మల్దకల్ మండల పరిధిలోని కుర్తిరావుల చెరువు గ్రామానికి చెందిన మైనార్టీ నాయకులు ఉర్దూ ఘర్ కమ్ షాదీఖానా నిర్మాణం ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీచేసి 30లక్షల వ్యయంతో నిర్మాణం చేయడానికి కేటాయించినందుకు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డికి,ఎమ్మెల్యే తనయుడు బండ్లసాయి సాకేత్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. సీఎం కెసిఆర్‌కు, మంత్రి హరీష్‌రాకు, కెటిఆర్‌కు, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డికి బిఆర్ఎస్ పార్టీకి ఎల్లప్పుడు రుణపడి ఉంటామని మైనార్టీ నాయకుల తరపున తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా డైరెక్టర్ సుభాన్, ఎంపిపి రాజారెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు నరసింహారెడ్డి, ఆంజనేయులు, మహబూబ్ అలీ, గజ్జలన్న, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.



మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



# వర్షాల పట్ల .. అప్రమత్తంగా ఉండాలి..!

● ప్రజలు ఇబ్బంది పడకుండా కాపాడుకుంటాం..

● చెరువులు, కుంటలు తెగినా సమాచారం ఇవ్వండి..

● ఇండ్లలోకి నీళ్లు వచ్చినా కంట్రోల్ రూంకు ఫోన్ చేయండి

● ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్

● వరద ప్రాంతాల్లో మంత్రి పర్యటన

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 21, ప్రభాతవార్త :** గత మూడు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా అలాగే మహబూబ్ నగర్ జిల్లాలోని ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ కోరారు. కుంటలు, చెరువులు తెగినా పెద్ద పెద్ద నాలాల పక్కన ఉన్న ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని, ఇండ్లలోకి నీళ్ల చేరినా, కుంటలు తెగినా కంట్రోల్ రూంకు ఫోన్ చేయాలని మంత్రి కోరారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ నెంబర్ 08542241165కు కాల్ చేయాలని, ఇది 24 గంటలు పని చేసేలా ఏర్పాట్లు చేశామన్నారు. గతంలో వర్షాలు లేక జిల్లాలో కరువు పరిస్థితి ఉండేదన్నారు. తెలంగాణలో హరితహారం కారణంగా వర్షాలు బాగా కురుస్తున్నాయని చెప్పారు. వర్షాల వల్ల ప్రజలకు ఇబ్బంది లేకుండా నాలాలను వెడల్పు చేస్తున్నామన్నారు. గణేష్‌నగర్ వద్ద ఉన్న ఎర్రకుంటకు సంబంధించిన 30ఏండ్ల కిందటి నాలాను పూడ్చి వేసినట్లు తమ దృష్టికి వచ్చిందని, తక్షణమే దానిని పునరుద్ధరిస్తామన్నారు. గణేశ్‌నగర్ నుంచి పాత మేనక టాకీస్ వరకు మరో నాలాను కోటి రూపాయలతో యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. అంతేగాక జాతీయ రహదారిపై ఉన్న మరో నాలా పూడిపోయిందని, దాన్ని కూడా మరమ్మతు చేస్తామన్నారు. గతంలో రామయ్య బౌలి,బీకే రెడ్డి కాలనీలు వర్షపు నీటికి మునిగిపోయేవని, కానీ నాలుగేండ్లుగా పక్కా ప్రణాళికతో వర్షపు నీటిని మళ్లించడం, నాలాను పూడిక తీత, వెడల్పు చేయడం వంటి చర్యల వల్ల ఇబ్బందులు తొలిగాయన్నారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ఏ ఒక్క ఇంటికీ వర్షపు నీరు చేరలేదన్నారు. పట్టణంలో మురికి నీటిని శుద్ధి చేసేందుకు మురికి నీరు సవ్యంగా వెళ్లేలా భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకుగానూ రాష్ట్ర ప్రభుత్వం రూ.276కోట్లను మంజూరు చేసిందని వచ్చేఏడాది ప్రణాళిక ప్రకారం పూర్తి చేస్తామని చెప్పారు.పట్టణంలోని లోతట్టు ప్రాంతాలైన కురహిణిశెట్టి కాలనీ, బండ్లగేరి తదితర కాలనీలన్నీ వర్షపు నీరు వల్ల ఇబ్బం దులు కలుగొద్దని వర్షపు నీరు, మురుగు నీరు వేరువేరుగా వెళ్లేలా ఎస్టీపీలు ఏర్పాటుచేస్తామన్నారు. భవిష్యత్తులో ఎంత వరద వచ్చినా నీరు కిందకు వెళ్లిపోయేవిధంగా ఏర్పాటు చేయడంతోపాటు మెయిన్ ట్రంక్‌లను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, జిల్లా రైతుబంధు కో ఆర్డినేటర్ గోపాల్‌యాదవ్, గొర్రె కాపరుల సంఘం జిల్లా అధ్యక్షుడు శాంతన్న యాదవ్, వైస్ చైర్మన్ గణేశ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి , మున్సిపల్ అధికారులు మంత్రి వెంట ఉన్నారు.



చెరువు, కుంటలను పరిశీలిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్



చెరువు, కుంటలను పరిశీలిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

# సీజన్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి:జిల్లా కలెక్టర్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై 21 ప్రభాతవార్త:**వర్షకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో సీజనల్ వ్యాధుల పట్ల వివిధ శాఖల అధికారులు అనుసరించాల్సిన విధానాలపై కోఆర్డినేషన్ కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షకాలం ప్రారంభమైన నేపథ్యంలో గ్రామాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే గా పాటించి అవసరమైన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. నీరు నిలువ ఉన్న చోట అవసరమైన మందు పిచికారి చేయాలన్నారు. దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులైన, మలేరియా, టైఫాయిడ్, చికెన్ గున్య, డెంగ్యూ, బోధకాలు, మెదడు వ్యాపుతో పాటు ఇతర వ్యాధులను అరికట్టడానికి ఎప్పటికప్పుడు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ఇండ్ల చుట్టు నీరు నిల్వ ఉండకుండా చూసుకునే విధంగా ప్రజల్లో అవగాహన కల్పించాలని, దీని కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని, పంచాయతీ శాఖను ఆదేశించారు. ఎక్కువగా నీళ్ల నిలువ ఉండే చోట మత్స్యశాఖ ఆధ్వర్యంలో గంబుసియా చేపలు పెంచడం లాంటి కార్యక్రమాలు చేయాలన్నారు. మిషన్ భగీరథ ద్వారా అందించే త్రాగు నీటిలో కలుషితం లేకుండా చూడాలన్నారు. ఎక్కడైన పైపులు లీకైతే వెంటనే మరమ్మత్తులు చేయాలని, మిషన్ భగీరథ ఈఈని ఆదేశించారు. వ్యాధుల నివారణ కోసం పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత కూడా అవసరమని పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలలు, రెసిడెన్సీయల్ పాఠశాలలు, వసతి గృహాల్లోని విద్యార్థుల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు వహించాలన్నారు. వసతి గృహాల్లో తనిఖీ చేసి పరిసరాలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్య వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సహజంగా వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రభలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వర్షకాలంలో వాతావరణంలో చోటు చేసుకునే మార్పుల ఫలితంగా సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, చికెన్ గున్య వంటి వ్యాధులతో పాటు విష జ్వరాలు ప్రభలే అవకాశం అధికంగా ఉంటుందని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు కాచి వడగాచిన నీటిని తీసుకోవడం తదితర అంశాలను ప్రజలకు అవగాహన కల్పించాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్యాలను పరీక్షించి అవగాహన కల్పించాలని వైద్య శాఖను ఆదేశించారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రమాదంగా ఉండేలా ప్రజలు అవగాహన ఉండేలా ఎలక్ట్రానిక్ మరియు ప్రింట్ మీడియాలతో ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో గత సంవత్సరం 45 డెంగ్యూ కేసులు నమోదయ్యాయని, ఈ సంవత్సరం ఇప్పటి వరకు రెండు డెంగ్యూ కేసులు, ఒక మలేరియా కేసు నమోదైందని, జిల్లాలోని వివిధ శాఖల అధికారులు నిర్వహించాల్సిన బాధ్యతలు, విధులపై అంతకు ముందు అసిస్టెంట్ మలేరియా అధికారి శ్రీనివాసులు వివరించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుధాకర్‌లాల్, పీడీ డీఆర్డీఏ నర్సింగ్‌రావు, డీఈఓ గోవిందరాజులు, డీపీఆర్ఓ సీతారాం, బీసీ వెల్ఫేర్ అధికారి శ్రీధర్‌జీ, మత్స్యశాఖ అధికారి లక్ష్మప్ప, మిషన్ భగీరథ ఈఈ శ్రీధర్, డిప్యూటీ డీఎంహెచ్ఓ వెంకటదాస్, అసిస్టెంట్ మలేరియా అధికారి శ్రీనివాసులు, వైద్య సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

# 90రోజులపాటు ఈవీఎంలపై అవగాహన..

**- వివిధ పార్టీల నేతల సమక్షంలో ఈవీఎం గోదాంల సందర్శన**

**- మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ జి రవినాయక్**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 21, ప్రభాతవార్త :** ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ద్వారా ఓటు వేయడంపై మూడు నెలలపాటు జిల్లాలోని ఓటర్లకు అవగాహన కల్పించనున్నట్లు కలెక్టర్ జి రవినాయక్ తెలిపారు.ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ద్వారా ఓటర్లకు అవగాహన కల్పించేందుకుగానూ జిల్లాలో అందుబాటులో ఉన్న ఈవీఎంల నుంచి అవసరమైన ఈవీఎంల ఎంపికకై శుక్రవారం ఆయన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు సమక్షంలో మహబూబ్‌నగర్‌లోని పాత కలెక్టర్ కార్యాలయం ఆవరణలోని ఈవీఎం గోదాంలలో ఈవీఎంలను ఎంపిక చేసే కార్యక్రమానికి కలెక్టర్ హాజరయ్యారు.ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న 90రోజులు 3వాహనాలద్వారా జిల్లాలోని మహబూబ్‌నగర్, దేవరకద్ర, జడ్చర్ల నియోజకవర్గాల్లో ఎలక్ట్రానింగ్ యంత్రాల ద్వారా ఓటర్లకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఓటు ఎలా వేయాలో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్ మోహన్‌రావు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ నుంచి ఇద్రీస్, తెలుగుదేశం పార్టీ నుంచి మురళి, వైఎస్సార్ టీపీ నుంచి బీడీ సామ్యూల్ హాజరయ్యారు.



కలెక్టర్, వివిధ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంల గోదాంను తెరుస్తున్న సిబ్బంది



వివిధ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్

# తెలంగాణ రైతులకు మెరుగైన ఉచిత విద్యుత్..

**- తీరనున్న లో వోల్టేజ్ సమస్యలు**

**- విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభోత్సవంలో**

**రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి**

**పెబ్బేరు,జూలై21,ప్రభాతవార్త:** దేశంలోనే తెలంగాణ రైతులకు మెరుగైన ఉచిత విద్యుత్ అందిస్తున్నదని తెలంగాణ ప్రభు త్వమేనని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని గుమ్మడం గ్రామంలో నిర్మించిన 33/11 కెవి విద్యుత్ ఉప కేంద్రాన్ని మంత్రి నిరంజన్‌రెడ్డి మండల ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లో సమస్య రాకుండా ఉండేందుకు అవసరమున్న చోట విద్యుత్ ఉప కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. రైతులకు నాణ్యమైన ఉచిత కరెంటుతో పాటు గృహ వినియోగదారులకు విద్యుత్ సమస్య తీరనుందన్నారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో రైతాంగానికి 24 గంటల ఉచిత కరెంటు అందిస్తున్న ఘనత ముఖ్య మంత్రి కేసీఆర్‌కే దక్కిందన్నారు. ప్రతిపక్ష పార్టీల కల్లబొల్లి మాటలు ప్రజలు నమ్మవద్దని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ తిరుపతిరావు, జడ్పీటీసీ పెద్దింటి పద్మ వెంకటేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ కర్రెస్వామి, సింగిల్‌విండో అధ్యక్షులు గౌని కోదండ రామిరెడ్డి, జగన్నాథం నాయుడు, వైస్ ఎంపీపీ కోట్ల బాలచంద్రారెడ్డి, సర్పంచ్‌లు సువర్ణ రాజవర్ధన్‌రెడ్డి, జూదం వెంకటేష్, గట్టయ్య, రంగదాస్, టీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు వనం రాములు యాదవ్, నాయకులు గౌని బుచ్చారెడ్డి, బాపురెడ్డి, ఎద్దుల సాయినాథ్, మహేశ్వర్ రెడ్డి, విక్రమం గౌడ్, చెన్నయ్య, శ్రీనివాస్ రెడ్డి, మధు, పుట్ట బాలరాజు, సందీప్‌రెడ్డి, ఎండి ముస్తాక్, వేణు , శాంతన్న తదితరులు పాల్గొన్నారు.

**మంత్రి సమక్షంలో పలువురు టీఆర్ఎస్‌లో చేరిక...**

పెబ్బేరు మండల పరిధిలోని గుమ్మడం గ్రామంలో విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభానికి వచ్చిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సమక్షంలో వివిధ పార్టీలకు చెందిన పలువురు టీఆర్ఎస్‌లో చేరారు. వారికి మంత్రి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



విద్యుత్ ఉప కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి



సబ్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

## మానాజీపేటకు కరెంటు కష్టాలు తీరనున్నాయి..

**రజక సంఘం భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి నిరంజన్‌రెడ్డి**

**జల్లాఘణపురం,జూలై21,ప్రభాతవార్త:** మండల పరిధిలోని మానాజీపేట గ్రామంలో రజక సంఘం కమ్యూనిటీ భవన నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమానికి శుక్రవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి , రజక సంఘం జిల్లా అధ్యక్షులు విజయ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అనంతరం మంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. రూ.10 లక్షలతో ఈ సంఘం భవనానికి ప్రభుత్వంచే నిధులు మంజూరు అయ్యాయని జిల్లా అధ్యక్షులు విజయ్ అన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... మానాజీపేట లో 11/33 కెవి సబ్ స్టేషన్, రజక సంఘం గౌడ సంఘం పశు వైద్యశాల కోసం నూతన భవనాల నిర్మాణాల కోసం భూమి పూజ చేసుకున్న మూడు నాలుగు నెలల్లో పనులు పూర్తి చేస్తామన్నారు. ఒక్కో భవనానికి పది లక్షల రూపాయలు మంజూరు అయ్యాయి. గతంలో మానాజీపేట కరెంటు కష్టాలు ఉన్నాయి. ఇప్పుడు సబ్ స్టేషన్ ద్వారా మల్కాపూర్ గట్టుకాడిపల్లి ఈ మూడు గ్రామాలకు కరెంటు సమస్య తీరనుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మన ప్రభుత్వం కుల వృత్తులదారులకు ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని వారి అభివృద్ధికి అన్ని విధాల ఆదుకోవడానికి ముందు కొస్తుందని అన్ని వర్గాల ప్రజల మన్ననలు కేసీఆర్ ప్రభుత్వం పొందు తుందన్నారు. వెనుకబడిన కులాల వారి కమ్యూనిటీ హాల్స్ దశల వారీ గా నిర్మాణ పనులను చేపడుతుంది.

ప్రభుత్వం వారు దరఖాస్తు చేసు కున్న రుణాలను అందరికీ త్వరలో అందనున్నాయని, రాష్ట్ర ప్రజలు మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వాన్నే కోరుతున్నారు. రాబోయే ఎన్నికల్లో కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి రానున్నట్లు మంత్రి అన్నారు. ఈ కార్యక్ర మంలో మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు కృష్ణ నాయక్, రైతు సమన్వ య కమిటీ మండల అధ్యక్షులు వెంకటరావు, గ్రామ సర్పంచ్ సతీష్, మండల ఎఈ ఖబీర్, రజక సంఘం జిల్లా అధ్యక్షులు విజయ్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, దాస్ గాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిపక్షాల అడ్రస్ గల్లంతు...

- మూడోసారి అధికారం చేపట్టి హ్యాట్రిక్ సాధిస్తాం...
- దేశంలోనే తెలంగాణను నెంబర్ వన్ స్థానంలో నిలిపిన ఘనత సీఎం కేసీఆర్‌దే...
- ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

**వెల్దండ, జూలై 21 ప్రభాతవార్త:**అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న సందర్భంలో తెలంగాణ రాష్ట్రంలో ప్రతిపక్షాలు పనికట్టుకొని ప్రభుత్వాన్ని విమర్శిస్తూ ప్రజలను పక్కదారి పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పేర్కొన్నారు. ప్రతిపక్ష పార్టీల నమ్మకాలు ఒమ్ము కాక తప్పదని, ప్రతిపక్షాల అడ్రస్ గల్లంతు కావడం ఖాయమన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలక పక్షాన్ని తిట్టినంత మాత్రన ప్రజలు బ్రహ్మరథం పడుతారని, బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఊహించుకోవడం వారి అవివేకానికి నిదర్శనమన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధికి అమడ దూరంలో ఉన్నదని, తెలంగాణ రాష్ట్రం సాధించిన తర్వాత సీఎం కేసీఆర్ మొదటి సారి అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక వినూత్నమైన పథకాలను ప్రవేశ పెట్టి పూర్తి స్థాయిలో అమలు చేసి అర్హులైన కులాలకు పథకాలను అందించి ప్రజల బాధలు, కష్టాలు నేరవేర్చారన్నరు. సీఎం కేసీఆర్ 2వ సారి పదవి చేపట్టిన తర్వాత ఉన్న పథకాలను మెరుగు పరుస్తూ ప్రజల కోరిక మేరకు కొత్త పథకాలను ప్రవేశ పెట్టి దేశంలో ఏ రాష్ట్రంలో చేయని అభివృద్ధిని తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

చేపట్టిందన్నారు. బడ్జెట్‌లో సింహభాగం సంక్షేమానికి కేటాయించి ప్రతి ఒక్కరిని ఆదుకున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం విశ్వనగరంగా అభివృద్ధి చెందిందని, లబ్ధి పొందిన ప్రజలు ఒక్కరికి ఒక్క వేటు వేసిన లక్ష మెజార్టీతో గెలుపొందుతారన్నారు. ముచ్చటగా మూడోసారి అధికారం చేపట్టి హ్యాట్రిక్ సాధిస్తామని, ప్రతిపక్షల కళలు కళలుగానే మిగిలిపోతాయని, నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని హితవు పలికారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు 3 గంటలు విద్యుత్ ఇస్తామని చెప్పడం వారి అవివేకానికి నిదర్శమన్నారు. రైతులకు పూర్వకాలపు పరిస్థితులు వచ్చే అవకాశం ఉందని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని నమ్మే స్థితిలో లేరన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అనేక సంక్షేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. కులాలు, మతాల పేరుతో దేశాన్ని బీజేపీ పార్టీ పాలించడానికి ప్రయత్నిస్తోందని, భారతదేశం సెక్యూలర్ దేశమని, అని కులాలు, మతాలను గౌరవించే దేశమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి పథకాలు బీజేపీ రాష్ట్రంలో చేపట్టి అమలు చేసి చూపించాలన్నారు.

## మణిపూర్ అల్లర్లపై నరేంద్రమోడీ, అమిత్‌షానే బాధ్యత వహించాలి

### నిందితులను కఠినంగా శిక్షించాలి: పిఓడబ్ల్యు

**నారాయణపేట ప్రతినిధి, జులై 21 ప్రభాతవార్త :** మణిపూర్ అల్లర్లపై నరేంద్రమోడీ, అమిత్‌షానే పూర్తి బాధ్యత వహించాలి, అమ్మాయిలను నగ్నంగా ఊరేగించి గ్యాంగ్‌రేప్ చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని (పిఓడబ్ల్యు) రాష్ట్ర సహాయ కార్యదర్శి విజయలక్ష్మి అన్నారు. ప్రగతిశీల మహిళా సంఘం (పిఓడబ్ల్యు) రాష్ట్ర కమిట పిలుపులో భాగంగా నారాయణపేట జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో (పిఓడబ్ల్యు) ఆధ్వర్యంలో నరేంద్ర మోడీ, అమిత్‌షా దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈసందర్భంగా మణిపూర్‌లో జరుగుతున్న దారుణాల్లో ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. కుకీ తెగకు చెందిన ముగ్గురు గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించి, సామూహిక అత్యాచారానికి పాల్పడి, వారిలో ఇద్దరిని హతమార్చిన ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.



ప్రధాని నరేంద్ర మోడీ, అమిత్‌షాల దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న ప్రగతిశీల మహిళా సంఘం సభ్యులు

ఈ దారుణం మణిపూర్ రాజధాని ఇంఫాల్‌కు 35 కి.మీ. దూరంలో ఉన్న నాంగ్‌పోక్ సెక్మాయ్ సమీపంలో జరిగిన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రభుత్వానికి తెలుసుకున్నప్పటికిని, ఈ ఘటనపై ఎలాంటి స్పందన లేనటువంటి పరిస్థితి మనకు స్పష్టంగా ఈ దేశంలో అమ్మాయిలకు రక్షణగా ఉంది. రక్షణ కల్పిస్తున్నాం అంటూనే అమ్మాయిలపై అతి కిరాతకంగా నగ్నంగా ఊరేగించి చేసినప్పటికి అక్కడున్న బిజెపి కేంద్ర ప్రభుత్వం అండతో ఎలాంటి చర్యలు తీసుకోకుండా, అల్లర్లను ప్రేరేపిస్తున్న పరిస్థితి కనిపిస్తుంది. అమ్మాయిలను నగ్న ప్రదర్శన చేసి అత్యాచారం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని, మణిపూర్ అల్లర్లపై నరేంద్రమోడీ, అమిత్‌షానే పూర్తి బాధ్యత వహించాలని లేనిపక్షంలో ప్రగతిశీల మహిళాసంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో (పిఓడబ్ల్యు) జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మి, టౌన్ అధ్యక్షులు సునిత, జిల్లా నాయకులు భాగ్యలక్ష్మి, టౌన్ ఉపాధ్యక్షులు రాధమ్మ, అరుణ, లక్ష్మి, నాగమ్మ, గజలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు దక్కని డబుల్ బెడ్‌రూం ఇండ్లు...

- కాంగ్రెస్ యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ క్యామ మల్లయ్య



పాల్‌థిన్‌కవర్లను అందజేస్తున్న దృశ్యం

**వంగూరు, జూలై 21 ప్రభాతవార్త:**తెలంగాణ రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల ప్రజలకు గూడును నిర్మించేందుకు డబుల్ బెడ్‌రూం పథకాన్ని ప్రవేశ పెట్టిన రాష్ట్ర ప్రభుత్వం నేటికి కూడా అమలు చేయకపోవడంతో నిరుపేదలు కురుస్తున్న వర్షాలకు తడుస్తూ జీవనం గడపాల్సిన పరిస్థితి ఏర్పడిందని కాంగ్రెస్ యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ క్యామ మల్లయ్య ఆవేదన వ్యక్తం చేశారు. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వంగూరు మండలం రంగాపూర్ గ్రామంలోని శిథిలావస్థలో ఉన్న నిరుపేదల ఇండ్లు కురుస్తుండటంతో తినడానికి తెచ్చుకున్న ధాన్యం తడిసి ముద్దవడంతో తిండిలేక పస్తులుండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని, వాటిని దృష్టిలో ఉంచుకొని శుక్రవారం శిథిలావస్థలో ఉన్న 30 ఇండ్లకు పాల్‌థిన్‌కవర్ల (డేరా)ను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదలకు ఇందిరమ్మ ఇండ్లను అందించి పేదోడి గృహకల్పన కళను నేరవేర్చారని ఆయన పేర్కొన్నారు. స్వరాష్ట్రంలో పేదలకు డబుల్ బెడ్‌రూం ఇండ్లను నిర్మించి గృహ కల్పనను అందించి పేద ప్రజలకు అండగా ఉంటామన్న బీఆర్ఎస్ నేతల మాటలు అమలుకు నోచుకోవడం లేదని ఆయన అన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే నిరుపేదలకు గృహాలను నిర్మించేందుకు అధిష్టానం నిర్ణయాలు తీసుకుంటుందని ఆయన పేర్కొన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణ రాష్టంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజు, నాయకులు నాగరాజు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి...

**కల్వకర్తి, జూలై 21 ప్రభాతవార్త:**కొత్త పెన్షన్ విధానం రద్దు, పాత పెన్షన్ విధానం పునరద్ధరణ అనే ఒకే ఒక్క లక్ష్యంతో ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రభుత్వ భీమా సంస్థలు, ప్రభుత్వ ఉద్యోగ సంఘాలు, ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘాలు మరియు ప్రభుత్వ పోస్టల్ సంఘాలన్ని కలిసి దేశ వ్యాప్తంగా జాతీయ స్థాయిలో ఒక ఐక్యవేధిక రూపుదిద్దుకుంటుందని ఓపీఎస్ ఐక్య వేధిక కల్వకుర్తి మండల టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్షులు పాండయ్య పిలుపునిచ్చారు. జాయింట్ ఫోరం ఫర్ రిస్టోరేషన్ ఆఫ్ ఓల్డ్ పెన్షన్ స్కీంలో ఉద్యోగ,ఉపాధ్యాయులు పోరుబాట పట్టాలన్నారు. కార్యచరణలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల, ఉపాధ్యాయుల ఐక్యత సాధన కొరకు, సీపీఎస్ రద్దు కోసం ఉద్యమం చేస్తూ పోరాటాన్ని మరింత ఉధృతం చేసే దిశగా జేఈఆర్‌ఏపీఎస్ తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో 23-07-2023 హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి సదస్సులను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి ప్రతి ఉద్యోగి అధ్యాపకుడు నూరు శాతం పాల్గని విజయవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేట్ లెవెల్ జాయింట్ కన్వెన్షన్ రాష్ట్ర స్థాయి ఐక్య సదస్సులో చలో హైదరాబాద్ పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా నాయకులు లింగమయ్య, నెహ్రూ ప్రసాద్, వెల్దండ, ఊర్కొండ మండలాల అధ్యక్షులు నాగభూషణం, రాములు, ప్రధాన బాధ్యులు టి.వెంకటయ్య,సి.కృష్ణయ్య, రాజు తదితరులు ఉన్నారు.



హైదరాబాద్ వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

## అసంఘటిత కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలి..

**అమరచింత,జూలై21,ప్రభాతవార్త:** దేశంలో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలో పని చేస్తున్న అసంఘటిత కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి సి.రాజు డిమాండ్ చేశారు . శుక్రవారం అమరచింత మండల కేంద్రంలో మార్క్స్ భవనంలో ఆగస్టు 4న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు దగ్గర జరిగే కార్మిక గర్జన ధర్నా పోస్టర్‌ను విడుదల చేశారు. దేశంలో అనేక రంగాలలో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనం లేక కార్మిక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని తీర్పు ఇచ్చిన పాలక ప్రభుత్వాలు అమలు చేయకపోవడం విడ్డూరంగా ఉందని ఆయన విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులకు సంబంధించిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి కార్మిక చట్టాలను పూర్తిగా రద్దు చేయడానికి ప్రధానమంత్రి నరేంద్రమోడీ కుట్ర పన్నుతున్నారని కార్మికులు ఐక్యంగా ఉండి కేంద్ర ప్రభుత్వానికి కార్మికులు తగిన బుద్ధి చెప్పాలని ఆయన కార్మికులను కోరారు. అలాగే బీడీ కార్మికులకు కేంద్ర ప్రభుత్వం జీవన భృతి ఇవ్వాలని, మిషన్ భగీరథ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగుల గుర్తించాలని, భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని గ్రామ పంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అసంఘటి రంగాలలో పని చేస్తున్న కార్మికుల సమస్యల సాధనకై ఆగస్టు 4న ఇందిరాపార్కు దగ్గర జరిగే ధర్నాకు వేలాది మంది కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సామేలు, ప్రేమరత్నం, జిలాని, భక్తరాజు, మహమూద్ తదితరులు పాల్గొన్నారు.



మార్క్స్ భవనంలో కార్మిక గర్జన పోస్టర్ విడుదల చేస్తున్న దృశ్యం

## వర్షం పడుతున్న కార్మికుల సమ్మె ఆగడం లేదు

**మక్తల్,జులై 21 ప్రభాతవార్త :** గ్రామ పంచాయతీ కార్మికుల 16వ రోజు సమ్మెలో భాగంగా మక్తల్ ఎంపిడిఓ కార్యాలయం ముందు గ్రామపంచాయతీ కార్మికుల నిరవధిక సమ్మెలో కూర్చుని ఉన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ (అనుబంధం ఐఎఫ్‌టియు) నాయకులు ఆర్. వెంకటేష్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులు 16 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.చాలీ చాలని వేతనాలను తీసుకుని జీవితాలను చీకటి మయంలో గడుపుతున్నామన్నారు. వర్షం పడుతున్న కూడా కార్మికులు లెక్క చేయకుండా తమ వేతనాల కొరకు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నాను కొనసాగిస్తున్నారని ఇకనైనా ప్రభుత్వం వారి సమస్యలపై స్పందించి వారికి వేతన చట్టం ప్రకారం వేతనాలు చెల్లించాలని అన్నారు. ప్రభుత్వం వెంటనే గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న ఐఎఫ్‌టియు నాయకులు వెంకటేష్

## చిన్నజట్రం రైతు వేదిక దగ్గర రైతులతో సమావేశం



**నారాయణపేట ప్రతినిధి,జులై 21 ప్రభాతవార్త :** మండలంలోని చిన్నజట్రం రైతుల వేదిక దగ్గర రైతులతో సమావేశం ఏర్పాటు చేసుకుని గత వారంలో కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు వ్యవసాయానికి మూడు గంటల కరెంటు చాలు అన్నందుకు ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డి పిలుపు మేరకు కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టాలని కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర రైతాంగానికి వెంటనే క్షమాపణ చెప్పాలని తీర్మాణించారు. కార్యక్రమంలో మండల నాయకులు, మండల ప్రజాప్రతినిధులు, మండల నాయకులు పాల్గొన్నారు.

## మల్లికార్జున్ ఖర్గేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వాకిటి శ్రీహరి

**నారాయణపేట ప్రతినిధి,జులై 21 ప్రభాతవార్త:** ఆల్ ఇండియా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేను వారి స్వగృహంలో నారాయణపేట కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వాకిటి శ్రీహరి వారికి పుష్పగుచ్ఛం అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ రాజకీయాలపై కొద్దిసేపు చర్చించినట్లు మీడియాకు తెలిపారు.ఆల్‌ఇండియా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు జన్మదినాన్ని మక్తల్‌లో పలువురు కేక్ కట్‌చేసి పుట్టిన రోజు వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.



## ఇల్లు నిర్మాణానికి ఇటుక అందజేత...



**కల్వకుర్తిరూరల్,జూలై 21 ప్రభాతవార్త:**కల్వకుర్తి మండలం ముకురాల గ్రామానికి చెందిన నారమళ్ల పద్మమ్మకు ఉండటానికి ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్నది. ఇటీవల ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు ఉప్పల వెంకటేష్ గ్రామంలో పర్యటించి నారమళ్ల పద్మమ్మ పరిస్థితి విని ఇంటి నిర్మాణానికి హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీలో భాగంగానే శుక్రవారం ఇంటి నిర్మాణానికి ఇటుకను అందించారు. కార్యక్రమంలో భారత జాగృతి విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు దారమోని గణేష్, గ్రామ సర్పంచ్ నరేందర్‌రెడ్డి, గ్రామస్తులు నరేందర్ ఉన్నారు.

## భైరాపూర్ గ్రామానికి పల్లె దవాఖాన మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు వినతి...

**వెల్దండ,జూలై21 ప్రభాతవార్త:**మండలంలోని భైరాపూర్ గ్రామానికి పల్లె దవాఖానా మంజూరు చేయాలని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ను హైదరా బాద్‌లోని ఆయన నివాసంలో శుక్రవారం సర్పంచ్ దార్లకుమార్, ఉప సర్పంచ్ రమేష్ గౌడ్ వినతి పత్రం అందించారు.ఈసందర్భంగా సర్పంచ్ దార్లకుమార్ మాట్లాడుతూ భైరాపూర్ గ్రామానికి పల్లె దవాఖాను మంజూరు చేసి నిర్మాణం కోసం రూ. 20లక్షలు మంజూరు చేస్తారని హామీ ఇచ్చారని, ఆసుపత్రి నిర్మాణ పనులను ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభిస్తామన్నారు.



## బాధితుడిని పరామర్శించిన ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్

**వెల్దండ,జూలై 21 ప్రభాతవార్త:**వెల్దండ మండలం అజిలాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లేష్ అనారోగ్యానికి గురై హైదరాబాద్ లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసు కున్న ఐక్యత ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ వరప్రసాద్‌రెడ్డి శుక్రవారం పరామర్శించి అధైర్య పడకుండా ధైర్యంగా ఉండాలని సూచించారు. ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. పరామర్శించిన వారిలో పంతులనాయక్, జయరాంనాయక్, రమేష్‌నాయక్, రఘునాయక్‌తో పాటు తదితరులు ఉన్నారు.



## చికిత్స పొందుతున్న మహిళను పరామర్శించి గోళి

**వెల్దండ, జూలై 21 ప్రభాతవార్త:**మండలంలోని చెర్కూర్ గ్రామానికి చెందిన పుష్పలత ప్రమాదవశాత్తు క్రింద పడి కుడి చేయి విరిగిపోయి హైదరాబాద్‌లోని బృంగి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నది. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు గోళి శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో మైసయ్య, శ్రీను, ఎండీ.అలీ, శ్రీనునాయక్, భాస్కర్, సందీప్, జంగయ్య ఉన్నారు.



## సీజనల్ వ్యాధులతో ప్రజలు జాగ్రత్తగా ఉండండి..

- డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్

**వీపనగండ్ల,జూలై21,ప్రభాతవార్త:**మండల కేంద్రంలోని వల్లభాపురం పల్లె దవాఖానలో గ్రామ ఆరోగ్య శానిటేషన్ , న్యూట్రిషన్ కమిటీ సమావేశం మండల వైద్యాధికారి డాక్టర్ వంశీకృష్ణ, ఎంఎల్‌హెచ్ పి. డాక్టర్ హేమవర్ధన్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...వర్షాకాలంలో ప్రజలు చాలా జాగ్రత్తగా ఉండాలని, ఉదయాన్నే గోరువెచ్చని నీళ్ల తాగాలని, ఆహార పదార్థాలు వేడివేడిగా తినాలని, ఆహార పదార్థాలపై ఈగలు, దోమలు వాలకుండా జాలీలు ఏర్పాటు చేసుకోవాలని, ఇంటి పరిసరాల చుట్టు నీరు నిల్వ ఉండకుండా చేయాలని, నీరు నిల్వ ఉంటే దోమలు వస్తాయని, వీటి వలన మలేరియా, డెంగ్యూ, మెదడు వాపు వ్యాధి, చికెన్ గున్యా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని వారు ప్రజలకు అవకాశం ఉన్నందున పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గర్భిణీ స్త్రీలు, చిన్న పిల్లలు పోషకాహారం తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ... ఆశా వర్కర్లు పల్లె దావఖాన ద్వారా ప్రజలకు ఆరోగ్య విషయం పట్ల తగిన సలహాలు జాగ్రత్తలు తెలియజేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిపిహెచ్ మణెమ్మ, సూపర్‌వైజర్ కళమ్మ, పంచాయతీ కార్యదర్శి, గ్రామ సర్పంచ్ రవీందర్‌రెడ్డి, రైతు సంఘం చైర్మన్, ఏఎన్ఎం ఆశా వర్కర్లు, అంగన్వాడీ ఉపాధ్యాయులు, గ్రామ సభ్యులు పాల్గొన్నారు.



## ఐఐటిలో సత్తా చాటిన మహేశ్వరిని సన్మానించిన ఎమ్మెల్యే

**ధరూర్,జులై 21 ప్రభాతవార్త :** మండల పరిధిలోని కోతులగిద్ద గ్రామానికి చెందిన పి. మహేశ్వరి ఈ ఏడాది నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌లో అత్యుత్తమ ప్రతిభను కనబరచి జార్ఖండ్ రాష్ట్రం, ధన్బాద్‌కి ఐఐటిలో సాధించింది. ఈసందర్భంగా శుక్రవారం గద్వాల జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పి.మహేశ్వరిని శాలువా కప్పి, పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అదేవిధంగా భవిష్యత్తులో మంచిగా చదువుకుని అత్యున్నత స్థాయికి ఎదగాలని ప్రభుత్వ రంగంలో ఉద్యోగం సాధించాలని మీ తల్లిదండ్రులకు, మీ గ్రామానికి, గద్వాల ప్రాంతానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా డైరెక్టర్ సుభాన్, ఎంపిపి విజయ్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు రంగస్వామి, శేషంపల్లి నర్సింహులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా మల్లిఖార్జున ఖర్గే జన్మదిన వేడుకలు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై 21 ప్రభాతవార్త:**నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో డాక్టర్ నాగం జనార్ధన్‌రెడ్డి నివాసంలో కాంగ్రెస్ పార్టీ నేషనల్ ప్రెసిడెంట్ మల్లిఖార్జున ఖర్గే జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నాగం శశిధర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా నాగం శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చి జన్మదిన కానుకగా అందిద్దామన్నారు. జన్మదిన వేడుకల్లో డీసీసీ ప్రధాన కార్యదర్శి అర్థం రవి, మున్సిపాలిటి అధ్యక్షులు తిమ్మాజిపేట పాండు, కౌన్సిలర్ నిజామొద్దిన్, సోషల్ మీడియా స్టేట్ సెక్రటరి సోషల్ మీడియా నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఇన్‌చార్జి మద్దెల చంటి, నాయకులు శ్రీకాత్, సలీం, భీముడు, లక్ష్మయ్య, హైమద్ పాష, బురాన్,సత్యం,భాస్కర్,రాజు, మొగులాల్ తదితరులు ఉన్నారు.



## గిరిజన విద్యార్థిని శ్యామలకు బాసటగా నిలిచిన ఎమ్మెల్యే

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై 21 ప్రభాతవార్త:**బిజినపల్లి మండలంలోని ఊడుగులకుంటతాండ గ్రామానికి చెందిన పాండు కుమార్తె కాట్రావత్ శ్యామల మెడిసిన్ విద్యాభ్యాసానికి ఎంజెఆర్ ట్రస్ట్ నుం చి రూ.60వేల ఆర్థిక సహాయాన్ని అందించి మరోసారి ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి అండగా నిలిచా రు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మొదటి, రెండో సంవత్సరం ఫీజు అందజేసి మళ్ళీ మూడో సంవత్సరం కళాశాల ఫీజు అందించానన్నారు. శ్యామల విద్యాభివృద్ధికి ఎమ్మెల్యే ఆర్థిక సహాయం అందించడంతో కాట్రావత్ పాండు కుటుంబ సభ్యులు, తాండ వాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



## గ్రామ అభివృద్ధికై స్థలం విరాళంగా అందించిన దేవరి మల్లప్ప

**నారాయణపేట ప్రతినిధి,జులై 21 ప్రభాతవార్త :** మక్తల్ మండలంలోని గుడిగండ్ల గ్రామ అభివృద్ధికై టీఎస్‌టిపిసి మాజీ చైర్మన్ దేవరి మల్లప్ప తన సొంత స్థలాన్ని విరాళంగా అందించారు. గ్రామంలోని సాయిరాం గ్రీన్ సిటీలోని 525 గజాల అభివృద్ధి పరిచిన స్థలాన్ని నూతన గ్రామ పంచాయతీ భవనం నిర్మాణం కోసం అందించారు. ఈ స్థలం విలువ దాదాపు రూ. 15 లక్షలు ఉంటుందని అంచనా. ఈసందర్భంగా శుక్రవారం స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్లను సర్పంచ్ మహేశ్వరి కిష్టప్ప,ఎంపిటిసి లక్ష్మి నర్సిరెడ్డి, ఉపసర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డిలకు అందించారు. అనంతరం టిఎస్‌టిపిసి మాజీచైర్మన్ దేవరిమల్లప్పను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్య క్రమంలో తిరుపతయ్య, పూజారి కూసురు రాజు, బాలప్ప, పూజారి లింగప్ప, రమేష్ పాల్గొన్నారు.



## డిగ్రీ కళాశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి..

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం

**అమరచింత, జులై21,ప్రభాతవార్త:**ఆత్మకూరు డిగ్రీకళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లాసహాయ కార్యదర్శి రాఘవ మాట్లాడుతూ... డిగ్రీ కళాశాలలో సమస్యలను పరిష్కరించాలని అనేక సార్లు ప్రి న్సిపాల్‌కు వినతిపత్రాలు ఇచ్చిన పట్టించుకోవడం లేదని అన్నారు.కళాశాలలో నూతన భవనాలు ఏర్పాటుచేసిన విద్యార్థులు క్లాస్‌రూమ్‌లోకి వెళ్లడానికి కాంట్రాక్టర్ మెట్లు వేయకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తక్షణమే కాంట్రాక్టర్ భవనం ముందు మెట్లు వేయాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే అధికారులు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌కు కాలేజీలో ఉన్న సమస్యలను తెలపాలని చెప్పిన ప్రిన్సిపాల్ నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపించారు.ఇప్పటికైనా విద్యాధికారులు కాలేజీలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఆయన అధికారులను కోరారు. లేనిచో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనకు పూనుకుంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రమేష్, భాను, అనిల్, ప్రణయ్ పాల్గొన్నారు.

## పండగ సాయన్న విగ్రహ భూమిపూజకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

**మక్తల్,జులై 21 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో ఏర్పాటు చేయనున్న తెలంగాణ రాబిన్‌హుడ్ పండగ సాయన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డిని కలిసి 23వ తేదీన భూమిపూజ కార్యక్రమానికి ఆహ్వానం పలికారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తప్పకుండా భూమిపూజ కార్యక్రమానికి హాజరవుతారని అందరు ఐకమత్యంతో ఉండి విగ్రహావిష్కరణకు ఎలాంటి ఆటంకాలు లేకుండా ఏర్పాటు చేసుకోవాలని వారు సూచించారు. అనంతరం సంఘం సభ్యులు మక్తల్ మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. మత్స్య కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కోళ్ల వెంకటేష్, కావలి శ్రీహరి, ఉపాధ్యక్షులు వాకిటి శ్యామ్, మాజీ ఎంపిటిసి లక్ష్మణ్, శేఖర్, అంజయ్యచారి, నర్సింలు, వెంకటయ్యతో పాటు వందమంది ముదిరాజ్ నాయకులు ఉన్నారు.



సరోజిని మల్టి స్పెషాలిటీ ఆసుపత్రిలో..

## ఆరోగ్యశ్రీ డయాలసిస్ సేవలను ప్రారంభించిన మంత్రి



సరోజిని ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ సేవలను ప్రారంభిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

**పెబ్బేరు, జూలై21, ప్రభాతవార్త:** పెబ్బేరు గ్రామీణ మండల పురపాలక ప్రజలు ప్రభుత్వం అందించే ఆరోగ్య శ్రీ సేవల కోసం పెద్ద పెద్ద పట్టణాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ప్రజలకు చేరువలో ఆరోగ్యశ్రీ సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేసిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పెబ్బేరు పురపాలక కేంద్రంలో సరోజిని మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నందు ఆరోగ్యశ్రీ డయాలసిస్ సేవలను మంత్రి నిరంజన్‌రెడ్డి ఆసుపత్రి యాజమాన్యం ప్రజాప్రతినిధులతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం ఏర్పడ్డాక వైద్య సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచినచందని అన్నారు. అత్యాధునిక సౌకర్యాలతో పెబ్బేరు పురపాలక కేంద్రంలో సరోజిని ఆసుపత్రి ఏర్పాటు చేశారని అన్ని సౌకర్యాలు ఆసుపత్రిలో ఉన్నందున ప్రభుత్వం ఆరోగ్యశ్రీ సేవలు అందించేందుకు అనుమతి ఇచ్చిందన్నారు. ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ ద్వారా రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందేలా చూడాలని ఆసుపత్రి యాజమాన్యానికి మంత్రి సూచించారు. జిల్లాలో సరోజిని ఆసుపత్రికి ఆరోగ్య సేవలో అందించే అవకాశం కల్పించినదుకు ఆసుపత్రి యాజమాన్యం ఆర్థోపెటిక్ వైద్యులు డాక్టర్ భరత్ కుమార్ రెడ్డి కుటుంబ సభ్యులు మంత్రి నిరంజన్‌రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ తిరుపతిరావు, మున్సిపల్ చైర్ పర్సన్‌ఎద్దుల కరుణశ్రీ సాయి, వైస్ చైర్మన్ కర్రెస్వామి, జడ్పీటీసీ పెద్దింటి పద్మా, వెంకటేష్, సింగిల్‌విండో అధ్యక్షులు గౌని కోదండరాంరెడ్డి, కౌన్సిలర్లు ఎల్లారెడ్డి, గోపి బాబు, మేకల సుమతి ఎల్లయ్య, వైస్ ఎంపీపీ కోట్ల బాలచంద్రారెడ్డి, సర్పంచులు జూదం వెంకటేష్, గట్టయ్య, టీఆర్ఎస్ పట్టణ మండల అధ్యక్షులు దిలీప్ కుమార్‌రెడ్డి, వనం రాములు, టీఆర్ఎస్ నాయకులు గౌని బుచ్చారెడ్డి, రంగారెడ్డి, మహేశ్వర్ రెడ్డి, మధు, ఎండి ముస్తాక్, ఐజాక్, పృధ్వీరాజ్, సందీప్ రెడ్డి, పుట్ట బాలరాజు, వేణు, శాంతన్న, బలరాం నాయుడు, భారతి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## కులమతాలకతీతంగా పీర్ల పండుగ

- పెబ్బేరులో పీర్ల చావిడిని సందర్శించిన మంత్రి నిరంజన్‌రెడ్డి



**పెబ్బేరు, జూలై21, ప్రభాతవార్త:** కులమతాలకతీతంగా పీర్ల పండుగను జరుపుకోవడం జరుగుతుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పెబ్బేరు పురపాలక కేంద్రంలోని పీర్ల చావిడిని సందర్శించి పీర్ల పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన పీర్ల దగ్గర ప్రార్థన చేశారు. తొందరలోనే పీర్ల చావిడి మరమ్మతుల కోసం నిధులు కేటాయిస్తానని మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ ఎద్దుల కరుణశ్రీ సాయి, వైస్ చైర్మన్ కర్రెస్వామి, సింగిల్‌విండో అధ్యక్షులుగౌని కోదండరాంరెడ్డి, కౌన్సిలర్ ఎలాల్లరెడ్డి, మేకల సుమతీ ఎల్లయ్య, పట్టణ పార్టీ అధ్యక్షులు దిలీప్ కుమార్ రెడ్డి, నాయకులు గౌనిబుచ్చారెడ్డి, ఎండి ముస్తాక్, అక్కల జ్యోతి, భారతి కుమ్మరి రాజుబలరాం నాయుడు, వేణుగోపాల్, శాంతన్న పాల్గొన్నారు.

## శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో వైభవలక్ష్మి పూజా కార్యక్రమం

పాల్గొన్న ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి, మున్సిపల్ చైర్మన్ సతీమణి బిఎస్ కళావతి



పూజలు నిర్వహిస్తున్న మహిళలు

**గద్వాల ప్రతినిధి, జూలై 21 ప్రభాతవార్త:** గద్వాల పట్టణంలోని రాజావీధిలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో అధిక శ్రావణమాసం సందర్భంగా 121 మహిళలతో వైభవలక్ష్మి పూజ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గద్వాల ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి, మున్సిపల్ ఛైర్మన్ సతీమణి కళావతి హాజరై పూజా కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ముందుగా మహిళలు భక్తులతో కలిసి సాంప్రదాయం ప్రకారం వైభవలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించి తమ మొక్కులు చెల్లించున్నారు. బండ్ల జ్యోతి మాట్లాడుతూ గద్వాల నియోజకవర్గ ప్రజలందరు సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఆలూరు బిలకంటి రాము సతీమణి బిలకంటి రాధిక, ప్రధాన కార్యదర్శి నరహరి, శ్రీనివాసులు, కౌన్సిలర్ సతీమణి నరహరి సంగీత, కోశాధికారి బిలకటి సురేష్‌కుమార్ సతీమణి బిలకంటి మాధవి, పట్టణ మహిళా సంఘంఅధ్యక్షురాలు జి.మధుమతి, ప్రధాన కార్యదర్శి గట్టు రవళి, కోశాధికారిజయప్రదం, యువజన సంఘం అధ్యక్షులు బాణాల వెంకటరమణ, బాణాలస్వాతి 121ఆర్యవైశ్య మహిళలు, పూజారులు పూజలు నిర్వహించారు.

## నెంబర్ ప్లేట్ లేని వాహనాలకు జరిమానా..

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 21, ప్రభాతవార్త:** నెంబర్ ప్లేట్ లేకుండా రయ్ రయ్ మంటూ రోడ్లపైకి వచ్చి వాహనదారులకు పోలీసులు జరిమానా విధించారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఎస్పీ నరసింహ ఆదేశాల మేరకు శుక్రవారం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తన సిబ్బందితో కలిసి పట్టణంలో సుభాష్ స్టాచ్యూ కూడలిలో వాహనదారులను ఆపి తనిఖీలు నిర్వహించారు. నెంబర్ ప్లేట్ లేకుండా రోడ్లపైకి వచ్చి 16 మంది వాహనదారులకు జరిమానా విధించారు. ట్రాఫిక్‌నిబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లైసెన్స్, ఆర్సీ, హెల్మెట్ లేకుండా రోడ్లపైకి వస్తే చర్యలు తప్పవని వాహనదారులకు కౌన్సిలింగ్ నిర్వహించారు.



వాహనదారులకు జరిమానా విధిస్తున్న ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్

# మణిపూర్ అల్లర్లకు కేంద్రమే కారణం

● తక్షణమే ప్రధానమంత్రి మోడీ రాజీనామా చేయాలి : ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టు జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు

**ఉండవల్లి, జూలై 21 ప్రభాతవార్త:** మణిపూర్ రాష్ట్రంలో మైతీలు, కుక్కిల జాతుల మధ్య వైషమ్యాలను పెంచి రాజకీయ ప్రయోజనాల కోసం రావణకాష్టంగా మార్చిన చర్యలు అత్యంత హృదయ విదారకర, యావత్తు దేశం తలదించుకునేలా ఉన్నాయని సిఐటియు జిల్లా సమితి పేర్కొంది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, దేశంలో ఇంత దారుణమైన ఇలాంటి సంఘటనలు ఎన్నడు చూడలేదన్నారు. తక్షణమే బాధ్యత వహించి దేశ ప్రధానమంత్రి నరేంద్రమోడీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రెండు జాతుల మధ్య వైషమ్యాల వలన మహిళలను నగ్నంగా క్రూరంగా హింసించి, అత్యాచారం, హత్యచేసి బహిరంగంగా చంపడం వరకు వచ్చిందంటే దేశం ఎటుపోతుందో ఈ పాలకుల విధానాల వల్ల అర్థమౌతుందన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ నమో మోదీ ఏమి చేస్తున్నారన్నారు. దీన్నిబట్టి చూస్తే దేశంలో శాంతి లేదని, విద్వేసాలను రెచ్చగొడుతున్నారన్నారు. దళితులన్న, గిరిజనులన్న, ముస్లిం లన్నా, క్రైస్తవులన్నా, అణగారిన వర్గాలన్నా ఎందుకు వివక్షత చూపుతున్నారని దీనికి ప్రధానమంత్రి సమాధానం చెప్పాలని తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మణిపూర్‌ను శాంతింజేసి ప్రజలను కాపాడాలన్నారు. అందరికి రక్షణ కల్పించి అల్లర్లకు, అరాచకాలకు కారణమైన మహిళపై హత్య, అత్యాచారాలకు పాల్పడ్డ వారినికఠినంగా (చివరికి బిజెపివాళ్లే నాసరె) శిక్షించాలని డిమాండ్ చేశారు. మోడీ బిజెపి పాలన అంటే నేడు బిజెపి వారికోసం, బిజెపి వాళ్లకు కావాల్సిన వాళ్లకోసం, బిజెపి అధికారం కోసం, బిజెపి వాళ్ల ధనవంతుల కోసం తప్పప్రజలకోసం, దేశం బాగుకోసం పని చేయరని స్పష్టంగా అర్థమైందని ఘాటుగా విమర్శించారు. ఇదంతా మతం పేరిట దేశాన్ని చేస్తున్న మోసంగా అభివర్ణించారు. ఇప్పటికైనా మెయతీలా ఓట్లు ఎక్కువున్నాయని వారిని రెచ్చగొట్టే ఇలాంటి విద్వేషకరమైన స్వార్థపూరిత విధానాలు విడనాడి దేశం ముందుకు తీసుకువెళ్లేందుకు, అభివృద్ధి పరిచేందుకు పరిపాలన సాగించాలని హితవు పలికారు. కార్యక్రమంలో ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టుజిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఎ.శేఖర్, మహబూబ్‌పాషా, భాస్కర్, అశోక్, చిన్న ఆంజనేయులు, మహేష్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# మణిపూర్ ఘటన మానవ జాతికి కళంకం

- కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ



కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ



కెవిపిఎస్ వీపనగండ్ల మండల ప్రధాన కార్యదర్శి మురళి

**వీపనగండ్ల, జూలై21, ప్రభాతవార్త:** మణిపూర్ రాష్ట్రంలోని కాంగో పోప్కి జిల్లాలో ఇద్దరూ మహిళలపై జరిగిన సంఘటన భారతదేశ మానవజాతికి కళంకం అని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ అన్నారు. వారు మాట్లాడుతూ... కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని అన్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో మహిళలపై జరిగిన సంఘటన మరువకముందే, మణిపూర్‌లో జరిగిన సంఘటన అత్యంత అవమానీయమైన సంఘటనని అన్నారు. రెండు గిరిజన తెగలు మైతి, కుక్కి గిరిజన వర్గాల మధ్య జరుగుతున్న పోరును ఇప్పటి వరకు మూడు నెలలు అవుతున్న కేంద్ర ప్రభుత్వం అల్లర్లను కట్టడి చేయలేక పోయిందని, ఈ అల్లర్ల వలన చాలా మంది గిరిజన తెగలు, ఆదివాసులు ప్రాణాలు కోల్పోయారని వారన్నారు. ఏది ఏమైనా మహిళలపై జరిగిన అత్యాచార సంఘటన కెవిపిఎస్ తీవ్రంగా ఖండిస్తుందనిదోషులను వెంటనే ఉరి తీయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీపనగండ్ల మండల కెవి పిఎస్ కార్యదర్శి డి.మురళి మాట్లాడుతూ... మే4వ తేదీన ఇద్దరు మహిళలను అత్యాచారం చేసిన మానవ మృగాలను వెంటనే గుర్తించి దోషులం దరికీ ఉరిశిక్ష వేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ బీజేపీ ప్రభుత్వంలో మహిళలకు, దళితులకు రక్షణ లేకుండా పోయిందని ఆరోపించారు. అత్యా చారానికి గురైన మహిళలకు తగిన న్యాయం చేయాలని, ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని వారన్నారు.

# టీకికరణ నూరు శాతం పూర్తి చేయాలి

- 12 రకాల వ్యాధులకు సంబంధించి టీకాలు
- చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి
- రాష్ట్ర సర్విలెన్స్ అధికారి డాక్టర్ ఎండి అజార్



పోస్టర్ విడుదల చేస్తున్న దృశ్యం

**వనపర్తి వైద్య విభాగం, జూలై21, ప్రభాతవార్త:** జిల్లాలో 0-5 వయసు గల చిన్నారులకు ఇచ్చే టీకీకరణ కార్యక్రమాన్ని విజయవంతంగా నూరు శాతం పూర్తి చేయాలని రాష్ట్ర సర్విలెన్స్ అధికారి డాక్టర్ ఎండి అజార్ అన్నారు. మిషన్ ఇంద్రధనుస్సు కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని మెడికల్ ఆఫీసర్స్, సూపర్‌వైజర్‌లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ రవిశంకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. శుక్రవారం జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో నిర్వహించినఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... పుట్టిన బిడ్డ నుండి ఐదు సంవత్సరాల పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు ప్రతి బుధవారం, శనివారం వేస్తారని తెలిపారు. టీకాలు పొందిన వారికి తిరిగి రెండవ టీకా ఆగస్టు నెలలో 9వ తేదీ నుండి 14వ తేదీ వరకు, 4వ టీకా అక్టోబర్ నెలలో 9వ తేదీ నుండి 14వ తేదీ వరకు సంపూర్ణ టీకా కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. 12 రకాల వ్యాధు లకు సంబంధించి 0-5 వయసు గల పిల్లలకు వారి వయసుకు తగ్గ టీకా లు ఇవ్వాలని, టీకాలు పొందిన వారిని గుర్తించి ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలో సంపూర్ణ టీకా కార్యక్రమం జయప్రదం చేయాలని శిక్షణ ఇవ్వ డం జరిగింది. టీకాలు వేసినతరువాత ఏమైనాదుష్పరిణామాలుజరిగితే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని మెడికల్ ఆఫీసర్స్‌కు తెలియ జేయాలన్నారు. వీరితో పాటు వనపర్తి జిల్లాలోని చిన్న పిల్లల వైద్య నిపు ణులు డాక్టర్ అశోక్ ప్రభాత్, డాక్టర్ వంశీ, డాక్టర్ హరికృష్ణలను సందర్శిం చగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలోడిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రామచంద్రరావు, డాక్టర్‌సాయినాథ్‌రెడ్డి, డాక్టర్ పరిమళ, వనపర్తి జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర సర్విలెన్స్ అధికారి డాక్టర్ ఎండి అజార్, హాజరైన జిల్లాలోని వైద్యులు

# వ్యవసాయాన్ని పండగలా చేసింది సీఎం కెసిఆర్

◆ కాంగ్రెసోళ్లు చెప్పినట్లు మూడు గంటల కరెంటు అయ్యేపని కాదు.. మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో నల్గొండ రైతుబోర్ల రామిరెడ్డి
◆ తెలంగాణ ఏర్పడిన తర్వాత రైతుగోస తీరిందన్న బోర్ల రామిరెడ్డి
◆ సీఎం కెసిఆర్, మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపిన రైతు



మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో బోర్ల రామిరెడ్డి

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, జూలై 21 ప్రభాతవార్త:** సమైక్య రాష్ట్రంలో చంద్రబాబునాయుడు హయాం నుంచి రాజశేఖర్‌రెడ్డి పరిపాలన వరకు కరువుతో తెలంగాణ రైతులు, ప్రజలు తీవ్రంగా అల్లాడిపోయారని రాష్ట్రం ఏర్పడిన తర్వాతే కడుపునిండా తింటున్నారని కంటి నిండా నిద్రపోతున్నారని నల్గొండకు చెందిన రైతు బోర్ల రాంరెడ్డి మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో రామిరెడ్డి మంత్రిని కలిసి నాటికి నేటికి రాష్ట్రంలో వ్యవసాయంలో వచ్చిన మార్పును తెలియజేశారు. తనకున్న 40ఎకరాల పొలానికినీళ్ల లేక సమైక్య రాష్ట్రంలో ఉన్నప్పుడు 100 బోర్లు వేయించానని అందుకే తనను అందరూ బోర్ల రామిరెడ్డి అని పిలవడం ప్రారంభించారని మంత్రికి తెలిపారు. సొంతూరులో బోర్లు పడక పక్క ఊరిలో బోర్లు వేయించి అక్కడి నుండి ట్యాంకర్ల ద్వారా నీటిని తీసుకొచ్చి వ్యవసాయం చేసిన పరిస్థితిని గుర్తు చేసుకున్నారు. అప్పుడు కరెంటు సక్రమంగా లేక అర్ధరాత్రి పూట ఎప్పుడు వస్తుందో తెలియక స్టార్టర్ల వద్ద తలపెట్టి పడుకున్న రోజుల ఇంకా మర్చిపోలేదన్నారు. నీళ్లు, కరెంటుకోసం పడిన గోస మామూలుగా ఉండేది కాదన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత సమైక్య రాష్ట్రంలో ఎదుర్కొన్న కష్టాలన్నితొలగిపోయాయని సంతోషం వ్యక్తంచేశారు. కాంగ్రెసోళ్లు చెప్పినట్లు మూడు గంటల కరెంటు అంటే మళ్లీ మునుపటి రోజులు తప్పవని రైతు రామిరెడ్డి మంత్రి దృష్టికి తీసుకుపోయారు. వ్యవసాయాన్ని పండగ చేసినందుకు ముఖ్యమంత్రి కెసిఆర్, మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. సమైక్య రాష్ట్రంలో పడరాని పాట్లన్ని పడినా వ్యవసాయాన్ని వదలకుండా కష్టపడి నేటి తరానికి బోర్ల రామిరెడ్డి లాంటి వారు ఆదర్శంగా నిలుస్తున్నారని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రశంసించారు.

# రైతు వ్యతిరేక కాంగ్రెస్ పార్టీని తరిమేయాలి

● ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ● అభివృద్ధిని చూసి కాంగ్రెస్ పార్టీ నుంచి బిఆర్ఎస్ పార్టీలో చేరికలు



ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సమక్షంలో కాంగ్రెస్ పార్టీ నుంచి బిఆర్ఎస్ పార్టీలో చేరికలు

**లింగాల, జులై 21 ప్రభాతవార్త:** రైతు వ్యతిరేక కాంగ్రెస్ పార్టీని తరిమేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. శుక్రవారం లింగాల మండల కేంద్రంలోని రెండవ వార్డుకు చెందిన 50 మంది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. కండువాలు కప్పి పార్టీలోనికి వారిని సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు మాట్లాడుతూ రాష్ట్రం పచ్చబడుతుంటే కాంగ్రెస్ పార్టీ వారికి కండ్లు ఎర్రబడుతున్నాయని, అభివృద్ధిని చూసి ఓర్వలేక బిఆర్ఎస్ పార్టీపై విమర్శలు చేస్తున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మే స్థితిలో లేరని పేర్కొన్నారు. పూటకో మాటలు మాట్లాడుతూ ప్రజలను మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రజలకు బిఆర్ఎస్ అన్ని విధాలుగా ఆదుకుంటుందని వారి సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి కెసి ఆర్ కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. బిఆర్ఎస్ పార్టీ చేస్తున్న సంక్షేమాన్ని, అభివృద్ధిని చూసే బిఆర్ఎస్ పార్టీలోకి వలసలు వస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటిసి మాకం తిరుపతయ్య, జిల్లా నాయకులు కెటి తిరుపతయ్య, సర్పంచ్ కోనేటి తిరుపతయ్య, మాజీ సింగిల్ విండో ఛైర్మన్ వెంకట్‌రెడ్డి, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు సుధీర్‌గౌడ్, టౌన్ ప్రెసిడెంట్ ఇరుకు మల్లేష్, మల్లేష్, రానోజీ, వెంకటగిరి, నాగేశ్వర్, వీరస్వామి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## వానలతో అప్రమత్తంగా ఉండండి

◆ భూత్పూర్ మున్సిపల్ ఛైర్మన్ సత్తూరు బస్వరాజ్‌గౌడ్



**భూత్పూర్, జులై21 ప్రభాతవార్త:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావం వల్ల రాష్ట్రంలో గడిచిన వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు జన జీవనాన్ని అతలాకుతలం చేస్తున్నా యని భూత్పూర్ మున్సిపల్ ఛైర్మన్ సత్తూరు బస్వరాజ్‌గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. భూత్పూర్ మున్సిపల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో వానలు సామాన్య జన జీవనాన్ని స్తంభింపజేస్తున్నాయని అన్నారు. ఈ నేప థ్యంలో భూత్పూర్ పట్టణ ప్రజలు జోరువానలతో అప్రమత్తంగా ఉండా లని ఛైర్మన్ సూచించారు. పాడుబడ్డ పాత ఇళ్లు, మట్టిమిద్దెలు, రేకుల షెడ్లు, మట్టి రేకుల ఇళ్లల్లో నివాసముండే జనాలు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని సూచించారు. కౌన్సిలర్లు, ఆయా ప్రాంతాల వార్డు బూత్‌ల అధ్యక్షులు సామాన్యజనాల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో వారికి సహకరించాలని కోరారు.

## రైతు అభివృద్ధి కోసం పాటుపడుతున్న తెలంగాణ ప్రభుత్వం

◆ జడ్పీటిసి విజయభాస్కర్‌రెడ్డి



మాట్లాడుతున్న జడ్పీటిసి సభ్యుడు విజయభాస్కర్‌రెడ్డి

**కోయిల్‌కొండ, జులై 21 ప్రభాతవార్త:** రైతుల అభివృద్ధి కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం పాటుపడుతుందని మండల జడ్పీటిసి సభ్యుడు విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని అంకిళ్ల గ్రామంలో గ్రామ సర్పంచ్ రజిత రవీందర్‌రెడ్డి అధ్యక్షతన రైతు వేదిక దగ్గర నిర్వహించిన నిరసన కార్యక్రమానికి జడ్పీటిసి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధినేత రేవంత్‌రెడ్డి రైతుల పట్ల, బీఆర్ఎస్ పార్టీ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. కాంగ్రెస్ పార్టీ క్షమాపణలు చెప్పేవరకు టిఆర్ఎస్ పార్టీ నిరసన కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రైతు సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలు దేశంలో ఎక్కడ కూడా అమల్లో లేవన్నారు. కటిక చీకట్ల కాంగ్రెస్ కావాలో.. కరెంటు వెలుగుల బిఆర్ఎస్ కావాలో ప్రజలు ఆలోచించుకోవాల్సిన తరుణం వచ్చిందన్నారు. కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, కోయిల్‌కొండ గ్రామ సర్పంచ్ బి. కృష్ణ, మండల సింగిల్ విండో ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపిపి పారుపల్లి కృష్ణయ్య, మండల రైతు సమన్వయకర్త మల్లయ్య యాదవ్, జిల్లా రైతుకమిటి సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, మోదీపూర్ సర్పంచ్ బి.రవి, ఎంపిటిసి రఘునాథ్, మండల టిఆర్ఎస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షులు లక్ష్మి లక్ష్మినారాయణగౌడ్, గ్రామ ఉపసర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, గ్రామ టిఆర్ఎస్ పార్టీనేతలు సాయిబన్న, గోవిందుయాదవ్, దామోదర్ రెడ్డి, బుక్ కీపర్ రాములు పాల్గొన్నారు.

## అత్యవసరమైతే తప్ప ప్రయాణం చేయవద్దు : ఎస్సై



ఎస్సై బాలకృష్ణ

**ఉండవల్లి, జులై 21 ప్రభాతవార్త:** మండలంలో ఎడతెరిపి లేకుండా కురు స్తున్న అతిభారీ వర్షాల కారణంగా ఇండ్ల నుండి ఎవరు బయటకు రావద్దని అత్యవసరమైతే తప్ప ప్రయాణం చేయవద్దని ఎస్సై బాలరాజు తెలిపారు. భారీ వర్షాల కారణంగా మండల ప్రజలకుఅవగాహన కలిగించారు. ఈ సందర్భంగాఎస్సై బాలరాజు మాట్లాడుతూ మండలం, గ్రామా ల్లో ప్రజలు గుడిసెలు, శిథిలావస్థలో ఉన్న పాత ఇండ్లలో ఉన్న నివాసులు అప్రమత్తంగా ఉండాలని, వర్షాలు తగ్గేవరకు మరోచోట ఉంటే క్షేమ మని తెలిపారు. వాగులు, చెరువులు, అలుగుల వద్దకు పిల్లలను చేపలవేటకు వెళ్లనివ్వకుండా జాగ్రత్తలు పాటించాలని ఆయన తెలిపారు. విద్యుత్ స్థంభాలు, తడిసిన గోడలు, ఇంటికప్పు రేకులకు దూరంగా ఉండాలని ఆయన సూచించారు. వాగులు నాళాలు దాటేందుకు సాహసం చేయరాద న్నారు. రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ పొలాల దగ్గర అప్రమ త్తంగా ఉండాలని, ట్రాన్స్ ఫార్మర్ దగ్గరమోటార్ స్టార్టర్లదగ్గర జాగ్రత్తగా వ్యవహరించాలని. అత్యవసర పరిస్థితుల్లో 100కు ఫోన్ చేయాలని తెలిపారు.

## ఐఐటిలో ప్రతిభ సాధించిన విద్యార్థికి సన్మానం



విద్యార్థినిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి

**ధరూర్, జులై 21 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కోతులగిద్ద గ్రామానికి చెందిన పి.మహేశ్వరి ఈ ఏడాది నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌లో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి జార్ఖండ్ రాష్ట్రం, ధన్బాద్‌కి ఐఐటిలో సీటు సాధించింది. ఈ సందర్భంగా గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేసతీమణి బండ్ల జ్యోతి కృష్ణమోహన్‌రెడ్డి పి. మహేశ్వరిని శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా సత్కరించి 25 వేల ఆర్థిక సహాయం అందించారు. భవిష్యత్తులో అదేవధంగా మంచిగా చదువుకొని మంచి ర్యాకు సాధించి అత్యున్నత స్థాయికి ఎదగాలి ఖచ్చితంగా భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని మీ తల్లిదండ్రులకు, మీ గ్రామానికి, గద్వాల ప్రాంతానికి మంచిపేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ధరూర్ మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

## హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**ఉప్పునుంతల, జులై 21 ప్రభాతవార్త:** మండలంలో హరితహారం కార్యక్రమం విజయవంతంగా సాగేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని డివిజన్ పంచాయతీ అధికారి వెంకటయ్య, ఎంపిడిఓ లక్ష్మణ్‌రావులు పిలుపునిచ్చారు. శుక్రవారం ఉపాధి హామీ పథకం సిబ్బంది, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మారు మాట్లాడుతూ హరితహారం, లేబర్ బడ్జెట్ అచీవ్‌మెంట్, కమ్యూనిటీ సోక్పిట్, గ్రామ పంచాయతీలలో 7 విభాగాలకు సంబంధించిన రికార్డులు, స్వచ్ఛ సర్వేక్షన్‌పై సమీక్షలో అవగాహన కల్పించారు. సమీక్ష సమావేశంలో అచ్చంపేట పంచాయతీ డివిజన్ అధికారి వెంకటయ్య, ఎంపిడిఓ లక్ష్మణ్ రావు, మండల పంచాయతీ అధికారి నారాయణ, ఈజిఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఓ లక్ష్మణ్‌రావు

### మొదటి విడత మన ఊరు మనబడి పనులు

# ఆగస్టు చివరి నాటికి పూర్తి చేయాలి

## - వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**వనపర్తి టౌన్,జూలై21,ప్రభాతవార్త:** మొదటి విడతలో చేపట్టిన మన ఊరు మన బడి అభివృద్ధి పనులు ఆగస్టు చివరి వరకు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం ఐడీవోసీలోని సమావేశ మందిరంలో జిల్లాలోని ఇంజనీరింగ్ అధికారులు, విద్యా శాఖ, మున్సిపల్ శాఖతో పాటు వైద్య శాఖ అధికారులతో మన ఊరు మన బడి కార్యక్రమ అమలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వివరిస్తు పాఠశాలల మరమ్మతులు , నిర్మాణానికి సంబంధించిన ఏమైనా సమస్యలు ఉంటే అక్కడికక్కడే మండల అధికారులతో చర్చించి పరి ష్కరించాలని అక్కడ పరిష్కారం కాని పక్షంలో తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. పనులు మాత్రం ఆగస్టు చివరిలోగా పూర్తి కావాలని ఆదే శించారు. పడమటి తండా పాఠశాల నిర్మాణానికి గల స్థల సమస్యను వెంట నే పరిష్కరించాలని ఘణపూర్ తహసీల్దార్‌ను ఆదేశించారు. వనపర్తి నడిబొడ్డున గల జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. పెబ్బేరు పట్టణంలో పాఠశాల భవనాల నిర్మాణంలో జాప్యం జరగడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు త్వరగా పూర్తి చేయడమే కాకుండా నాణ్యతలోలోపాలు ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. పానుగల్ జడ్పీహెచ్ఎస్ మండలంలోని శాగాపూర్, శేరు పల్లి,ఘణపూర్ మండలం ఉప్పరపల్లిగ్రామాలలో ఉన్న చిన్న చిన్న సమస్యలు గ్రామ పెద్దలతో సర్పంచ్ యుక్తంగా చర్చించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. భూమి కేటాయింపులు బదలాంపులు నిబంధన ప్రకారం జరగాలని కోరారు. టెక్నికల్‌గా చిన్న చిన్న పొరపాటు జరిగితే భవి ష్యత్తులో నష్టం జరుగుతుందని ఇంజనీర్లు ఈ విషయంలో దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బి పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ ఈడబ్ల్యూఐడీసీ పబ్లిక్‌హెల్త్ ఇంజనీర్లు సీపీవో తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

## వరద పరిస్థితులపై గట్టు గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



గట్టు మండల సర్పంచ్ ధనలక్ష్మి కృష్ణమూర్తి

**గద్వాల ప్రతినిధి, జులై21 ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో గత మూడు రోజులుగా జిల్లాలో నిరంతరాయంగా కురుస్తున్న వర్షాల కార ణంగా ఏర్పడుతున్న వరద పరిస్థితులపై గట్టు గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గట్టు మండల సర్పంచ్ ధనలక్ష్మి కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలి పారు. రాబోయే రెండు రోజులు కూడా వర్షసూచన ఉండడంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, గట్టు మండల గ్రామ సర్పంచ్ ధన లక్ష్మి కృష్ణమూర్తి ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సహాయం చేసేందుకు సిద్ధంగా ఉంటుందని తెలిపారు. వరద పరిస్థితులపై గట్టు గ్రామప్రజలకు ఏ విధమైన సహాయం కోసమైనా గట్టు గ్రామ ప్రజలు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్ 9440295308 గట్టు గ్రామ సర్పంచ్‌ధనలక్ష్మి కృష్ణమూర్తిఎల్లప్పు డు అందుబాటులో ఉంటారని తెలిపారు.

## డ్రోన్ ప్రదర్శన 28వ తేదీకి వాయిదా

**మహబూబ్‌నగర్ బ్యూరో,జులై 21 ప్రభాతవార్త:** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ఈనెల 23న ట్యాంక్ బండ్‌పై నిర్వహించాల్సిన డ్రోన్ ప్రదర్శనను ఈనెల 28కి వాయిదా వేసినట్లు రాష్ట్రఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో శుక్రవారం ఆయన మహబూబ్‌నగర్ పట్టణంలోని లోతట్టు ప్రాంతాలైన గణేష్‌నగర్, ఎర్రకుంటలలో పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహబూబ్‌నగర్ పట్టణంలోని ట్యాంక్ బండ్‌పై ఈనెల 23న 450 డ్రోన్‌లతో అతిపెద్ద డ్రోన్ ప్రదర్శన నిర్వహించాలని నిర్ణయించామని, అయితే గడిచిన వారం రోజుల నుండి నిరంతరాయంగా వర్షం కురుస్తుండడం, రాబోయే 2,3 రోజులు కూడా వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున డ్రోన్ ప్రదర్శనను ఈనెల 28కి వాయిదా వేసినట్లు తెలిపారు. వర్షం కారణంగా ఒకసారి 450 డ్రోన్‌లు ఆకాశంలో ఎగరలేవని, అందువల్ల దీనిని దృష్టిలో ఉంచుకుని డ్రోన్ ప్రదర్శనను ఈనెల 28కి మార్చినట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలు, ముఖ్యంగా పట్టణ ప్రజలు ఈనెల28న సాయంత్రం 7గం.లకు ట్యాంక్‌బండ్‌పై నిర్వహించనున్న డ్రోన్ ప్రదర్శనకు మహబూబ్‌నగర్ పట్టణంలోని ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు, చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంత చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## సెల్ అధ్యక్షుడు నాగరాజు గుండెపోటుతో మృతి

**అలంపూర్,జులై 21 ప్రభాతవార్త:** వడ్డేపల్లి మండలం రామాపురం గ్రామానికి చెందిన నాగరాజుగౌడ్ గురువారంరాత్రి గుండెపోటుతో మరణించడాన్ని తెలుసుకుని ఆయన భౌతికకాయానికి వడ్డేపల్లి మండల అధ్యక్షుడు బంగారు రామకృష్ణారెడ్డి నివాళులర్పించారు. ఆయనతో పాటు వడ్డేపల్లి టౌన్ ప్రెసిడెంట్ చిన్నిబాబు, జోగులాంబ గద్వాల జిల్లా మహిళా అధ్యక్షురాలు దండముని నాగశిరోమణి, వడ్డేపల్లి దేవేందర్, అలంపూర్ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జోగుల రవి, పుటాన్‌దొడ్డి వెంకటేష్, పైపాడు రామ్‌రెడ్డి, జయరామ్‌రెడ్డి, ఈశ్వర్, నవీన్, నరసింహనాయుడు, పరుష పాల్గొన్నారు.

## వీరాయిపల్లిలో మృతుల కుటుంబాలను పరామర్శించిన మంత్రి



**పెద్దమందడి,జూలై21,ప్రభాతవార్త:** మండల పరిధిలోని వీరాయిపల్లి గ్రామంలో వడ్ల కృష్ణయ్య (55) అనే వ్యక్తి గుండెపోటుతో శుక్రవారం మృతి చెందాడు. అలాగే గ్రామానికి చెందిన బోయ బాలయ్య, మరో ఇద్దరు ఇటీవల మృతి చెందారు. గ్రామ బీఆర్ఎస్ నాయకులు మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షులు రాజాప్రకాష్‌రెడ్డి ద్వారా సమాచారం తెలుసుకున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం వీరాయిపల్లి గ్రామానికి వెళ్లి మృతుడు వడ్ల కృష్ణయ్యచారి, బోయ బాలయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి మృతి గల కారణాలను తెలుసుకుని కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. ప్రభుత్వపరంగా మృతుల కుటుంబాలను ఆదుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. మంత్రి వెంట గ్రామ బీఆర్ఎస్ నాయకులు రాజప్రకాష్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

## సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం




**మాగనూరు,జులై 21 ప్రభాతవార్త :** మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండల ఎంపిపి శ్యామల చెన్నప్ప అధ్యక్షత వహించారు. వివిధ శాఖలలో జరిగిన కార్యక్రమాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. మహిళా సంఘంలో శ్రీనిధి మండలంలో ఉన్న కొన్ని గ్రామాలకు మాత్రమే ఎందుకు ఇస్తున్నారని మండలంలో ఉన్న ప్రతి సంఘానికి శ్రీనిధి అందజేయాలని సూచించారు. అదేవిధంగా వర్షాలు కురుస్తుండడంతో చాలాచోట్ల స్థంభాలు పడిపోవడం 24 గంటల కరెంటు ఇవ్వకపోవడంపై ఏఈ దృష్టి సారించాలని చెప్పారు. చాలా గ్రామాలలో విద్యుత్ దీపాలు లేకపోవడంపై సర్పంచ్‌లు ఎంపిడిఓను నిలదీశారు.రాత్రి సమయంలో విషపూరితమైన కీటకాలు తిరగడంతో ప్రజలు ప్రమాదాలబారిన పడే అవకాశం ఉందని దీనిపై వెంటనే స్పందించాలని కోరారు. గ్రామీణ ఉపాధి పథకంలో రైతులకు సంబంధించి వివిధ రకాల పంటల గురించి, షెడ్ల గురించి శాఖ అధికారులు వివరించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచ్‌లు, శాఖ అధికారులు, ఎంపిటిసిలు, జడ్పీటిసి వెంకటయ్య, సింగిల్ విండో ఛైర్మన్ వెంకట్‌రెడ్డి, ఎంపిడిఓ వైస్ ఎంపిపి దూల తిప్పయ్య పాల్గొన్నారు.

## నూతన సిఐకి ఘన స్వాగతం



**భూత్పూర్,జులై21 ప్రభాతవార్త :** నూతన సిఐగా కొత్తగా పదవి బాధ్యతలు స్వీకరించిన రామకృష్ణను శుక్రవారం భూత్పూర్ పోలీస్ స్టేషన్‌లోని సిఐ చాంబర్‌లో పలువురు నేతలు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. సిఐని సత్కరించిన వారిలో భూత్పూర్ మున్సిపల్ ఛైర్మన్ సత్తూరు బస్వరాజ్‌గౌడ్, ఎంపిపి ఛైర్మన్ కదిరె శేఖర్‌రెడ్డి, ముడా డైరెక్టర్ సత్తూరు చంద్రశేఖర్‌గౌడ్‌తో పాటు బిఆర్ఎస్ నాయకులు సత్తూరునారాయణగౌడ్,తూము శ్రీనివాస్‌రెడ్డి,సత్తూరు అశోక్‌రెడ్డి, మేకల సత్యనారాయణగౌడ్, గడ్డంప్రేమ్, గడ్డం యాదయ్య, సత్తూరు సురేష్‌గౌడ్, గడ్డం మునుస్వామి, గడ్డం నర్సింహులు ఉన్నారు.

## తృటిలో తప్పిన పెనుప్రమాదం

**భూత్పూర్,జులై 21 ప్రభాతవార్త:** ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలు, ఈదురు గాలుల వల్ల 33/11 కెవి విద్యుత్ లైన్ తెగి భూత్పూర్ మున్సిపాలిటీలో నాలుగో వార్డులోని ఓ ఇంటిపై పడింది. ఇంట్లో ఎవరు లేనందున పెను ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న మున్సిపల్ ఛైర్మన్ హుటాహుటిన సంఘటనా స్థలానికి వెళ్లి సంబంధిత విద్యుత్ అధికారులను సంప్రదించి వైర్లను తొలగింపజేశారు.

# ఆర్థిక సహాయం అందించిన తూడి మేఘారెడ్డి



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న టీఎంఆర్ యువసేన నాయకులు

**వనపర్తి టౌన్,జూలై21,ప్రభాతవార్త:** వనపర్తి మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు నాగవరం కు చెందిన మండ్ల మణెమ్మ భర్త మన్యం అకస్మాత్తుగా మృతి చెందిన విషయాన్ని మండ్ల గట్టు నాయుడు వనపర్తి నియోజకవర్గ నాయకులు, పెద్దమందడి ఎంపీపీ తూడిమేఘారెడ్డికి సమాచారం ఇవ్వగా వెంటనే స్పందించి ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ దహన సంస్కారాల నిమిత్తం రూ.5వేలు ఆర్థికసాయాన్ని మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రాధాకృష్ణ తో పంపించారు. శుక్రవారం మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రాధాకృష్ణ, టీఎంఆర్ యువసేన నాయకులతో కలిసి మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు.ఆర్థిక సాయం అందించిన వారిలో నందిపేట తిరుపతి యాదవ్, గట్టు నాయుడు, ఆంజనేయులు, రవి,ఈశ్వర్, భాస్కర్, రాముడు తదితరులు పాల్గొన్నారు.

-వనపర్తి మున్సిపాలిటీలోని గాంధీనగర్ 20వ వార్డులో మంగలి నీలయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయాన్ని వార్డు నాయకుడు లేబర్ యూనియన్ లీడర్ సద్దుర్ల రమేష్ వనపర్తి నియోజకవర్గ నాయకులు పెద్దమందడి ఎంపీపీ తూడి మేఘారెడ్డి దృష్టికి తీసుకువచ్చిన వెంటనే స్పందిస్తు మానవ దృక్పథంతో సాటివారికి సాయం చేసే గుణంతో దహన సంస్కారాల నిమిత్తం రూ.5వేలు మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రాధాకృష్ణ,టీఎంఆర్ యువసేన నాయకులు కలిసి మృతుడి భార్య వరమ్మకు అందజేశారు. ఆర్థిక సాయం అందించిన వారిలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రాధాకృష్ణ, టీఎంఆర్ యువసేన నాయకులు నందిపేట తిరుపతి యాదవ్,లేబర్ యూనియన్ లీడర్ రమేష్, దామోదర్ ఉన్నారు.

# మూడు గంటలు కావాలన్న.. కాంగ్రెస్ కావాలా..?!

**● ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి**



గొర్రెలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

**చిన్నచింతకుంట,జులై 21 ప్రభాతవార్త:** వ్యవసాయ రంగానికి మూడు గంటలు ఉచిత విద్యుత్ చాలన్న కాంగ్రెస్ కావాలా ఉచితంగా 24 గంటలు విద్యుత్ అందిస్తున్న కెసిఆర్ ప్రభుత్వం కావాలి రైతులే తేల్చుకోవాలని స్థానిక ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి కోరారు. శుక్రవారం మండలంలోని ఆయా గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం పెద్దవడ్డెమాన్ గ్రామంలో రైతు వేదిక క్లస్టర్ వద్ద ఉచిత విద్యుత్‌కు మద్దతు తెలిపిన రైతుల సమావేశంలో జడ్పీ ఛైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొని మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న తెలంగాణ ప్రభుత్వానికి అప్పటి కాంగ్రెస్ పాలనలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను బేరీజు వేసుకోవాలని రైతలకు వారు సూచించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక రైతు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పంట పెట్టుబడికై రైతుబంధు, రైతు మరణిస్తే ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు రైతుభీమా, రైతులు వేసుకున్న పంటలు ఎండిపోకుండా ప్రాజెక్టుల నిర్మాణంతో సాగునీరు అందించి ఆకుపచ్చ తెలంగాణా మార్చిన ఘనత కెసిఆర్‌కి దక్కుతుందని అలాంటి కెసిఆర్‌కు రైతన్నలు మద్దతుగా నిలవాలని వారు కోరారు. దేశంలో కాంగ్రెస్, బిజెపి పాలిత రాష్ట్రాల్లో లేని సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి తెలంగాణను దేశంలోనే నంబర్‌వన్ స్థానానికి తీసుకెళ్లిన ఘనత కెసిఆర్‌కే దక్కుతుందని వారు తెలిపారు. పెద్దవడ్డెమాన్‌కు చెందిన ఖయ్యుం అనే రైతు అప్పటి కాంగ్రెస్ పాలనలో విద్యుత్ దుస్థితి,నేటి తెలంగాణ ప్రభుత్వ హయాంలో వ్యవసాయ రంగానికి అందిస్తున్న విద్యుత్‌పై చక్కగా వివరించారని ప్రతి రైతు ఇలా అవగాహన చేసుకుంటే కెసిఆర్ ప్రభుత్వం రైతుల పట్ల ఎంత చిత్తశుద్దితో పని చేస్తుందో అర్థమవుతుందని వారు తెలిపారు.

**గొల్ల కురుమలు ఆర్థికంగా ఎదగాలి:** తెలంగాణ రాష్ట్రంలోని గొల్ల కురుమలు ఆర్థికంగా ఎదిగేందుకు కెసిఆర్ ప్రభుత్వం ఉచితంగా గొర్రెలను అందిస్తుందని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పెద్దవడ్డెమాన్‌లో గొల్ల కురుములకు గొర్రెలను అందజేశారు. మండలంలోని నెల్లికొండి, దాసర్‌పల్లి, చిన్నవడ్డెమాన్, పర్దీపూర్, ముచ్చింతల గ్రామాలకు చెందిన గొల్లకురుమలకు ఉచితంగా 30 యూనిట్ల గొర్రెలను అందజేశారు.దమగ్నాపూర్ గ్రామంలో 20 లక్షలతో చేపడుతున్న ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్ర నిర్మాణనికి భూమిపూజ చేశారు. పర్దీపూర్ గ్రామంలో కుమ్మరులకు ఐదు లక్షలతో చేపడుతున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. గ్రామంలోని 300 ఎకరాల ఆయకట్టు ఉన్న భద్ర పంపుకాల్వను పరిశీలించారు.కాల్వకుసిసి వేయాలని గ్రామస్తులు కోరారు. కార్యక్రమంలో రైతు సమ్వయ సమితి జిల్లా సభ్యులు కరుణాకర్‌రెడ్డి, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షులు మన్యంగౌడ్, ఎంపిపి హర్షవర్ధన్‌రెడ్డి, జడ్పీటిసి వట్టెం రాజేశ్వరి రాము, విండో ఛైర్మన్లు ఉమామహేశ్వర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి,పార్టీ మండల అధ్యక్షులు కోటరాము, వ్యవసాయమార్కెట్ కమిటివైస్ ఛైర్మన్ దశరథ్‌రెడ్డి, సర్పంచ్‌లు ఫర్జానాబేగం, ప్రభాకర్, కోటసుప్రియ, సతీష్, రవిందర్‌రెడ్డి, రఘువర్ధన్‌గౌడ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ ముట్టడికి కదం తొక్కిన గ్రామ పంచాయతీ కార్మికులు



కలెక్టర్ ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

**వనపర్తి టౌన్,జూలై21,ప్రభాతవార్త:** తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం వనపర్తి జిల్లా పాల కేంద్రం నుండి కలెక్టరేట్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. జేఏసీ నాయకులు రాష్ట్ర కన్వీనర్ అరుణ్ కుమార్, సీఐటీయు రాష్ట్ర కమిటీ సభ్యులు పుట్ట ఆంజనేయులు, సీఐటీయు జిల్లా అధ్యక్షులు మండ్ల రాజు, ఐఎఫ్‌టీయు జిల్లా కార్యదర్శి ప్రసాద్‌లు మాట్లాడుతూ... స్వచ్ఛ తెలంగాణలో క్రియాశీల పాత్ర పోషిస్తు, జనారోగ్యం కోసం తమ ఆరోగ్యాన్ని ఫణంగా పెట్టి పని చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులకు 11వ పీఆర్‌సీ జీవో నంబర్ 60 ప్రకారం సఫాయి కార్మికులకు రూ.15600, కారోబార్, బిల్ కలెక్టర్, ట్రాక్టర్ డ్రైవర్లకు రూ.19500 వేతనం ఇవ్వాలని, ప్రమాద భీమా 10 లక్షలు, సాధారణ మరణానికి ఐదు లక్షలు బీమా కట్టాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర జేఏసీ 17 డిమాండ్లతో గత కొంతకాలంగా ప్రభుత్వానికి విన్నవించుకున్న చెవిటివానిలా వ్యవహరించడంతో అనివార్యంగా జూలై 6వ తేదీ నుండి సమ్మె చేస్తున్నామని వారు తెలిపారు. నరేంద్రమోడీ కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తు రాష్ట్ర శాసన సభ తీర్మాణం చేయాలని, రాష్ట్రంలో ఉన్న 50వేల మంది పంచాయతీ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ చట్టాలను వర్తింపజేయాలని వారు డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని 2016 అక్టోబర్ 26 తీర్పు ఇచ్చినరాష్ట్రంలోఅమలు చేయలేదని వారు తెలిపారు. సఫాయి కార్మికులు సిఫాయిలు ఉద్యమిస్తే తప్ప సమస్యలు పరిష్కారం కావని అన్నారు.సమస్యలు పరిష్కారం చేయని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా కార్మికులను సమీకరించి సెక్రటేరియట్ ముట్టడిస్తామని హెచ్చరించారు. 17 డిమాండ్లకు సంబంధించిన వినతిపత్రాన్ని కలెక్టర్ కార్యాలయంలోని ఏవోకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు బొబ్బిలి నిక్సన్, సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి ఆర్ఎన్ రమేష్, సూర్యవంశంరాము, గోపాలకృష్ణ, ఐఎఫ్‌టీయు నాయకులు కురుమయ్య, గణేష్, సుబ్బయ్య, గ్రామ పంచాయతీ కార్మికులు వెంకటేష్, అనిప్‌దాస్, భాస్కర్,బాలకృష్ణ చారి,పుష్పలత, శివరాజు జిల్లాలోని గ్రామ పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన నిరుపేదలకు ఇంటిస్థలాలు, గృహలక్ష్మి పథకం కింద ఇండ్లు మంజూరు

**394 మంది లబ్ధిదారులకు ఇంటి స్థలాల పట్టాలు పంపిణీ చేసిన ఢిల్లీ అధికార ప్రతినిధి, మాజీ ఎంపి మంద, అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం**



పట్టాలు అందుకున్న మహిళలతో ఢిల్లీ అధికార ప్రతినిధి, మాజీ ఎంపి మంద, ఎమ్మెల్యే అబ్రహం

**ఇటిక్యాల,జులై21 ప్రభాతవార్త:** అలంపూర్ నియోజకవర్గంలో అర్హులైన నిరుపేదలకు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ఇంటి స్థలాల పంపిణీ తెలం గాణ ప్రభుత్వంలో పాలనలో పరిష్కరించి అర్హులైన నిరుపేదలకు ఇంటి స్థలాల పట్టాలను పేదలకు అందించడం జరుగుతుందని ఈ స్థలాలలో గృహ లక్ష్మి పథకం కింద ప్రభుత్వం అందించే 3 లక్షల రూపాయలతో ఇళ్లను నిర్మా ణం చేసుకోవచ్చని ఢిల్లీ అధికార ప్రతినిధి మాజీ ఎంపి మంద జగన్నాథం, అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహాం అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వల్లూరు గ్రామంలో 138 మంది, షాబాద లో 127మంది లబ్దిదారులకు మొత్తం 394 మందికి ఇటిక్యాల రైతు వేదిక ఎంపిడిఓ కార్యాలయంలో ఢిల్లీ అధికార ప్రతినిధి, మాజీ ఎంపి మంద జగన్నాథం, అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహాం, స్థానిక తహసిల్దార్ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో పై మూడు గ్రామాల ప్రజా ప్రతినిధుల సమక్షంలో అధికారులు ఎంపిక చేసిన ఇంటి స్థలాల పట్టాలను వారు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ అజిత్, ఆర్ఐలు సుదర్శన్‌రెడ్డి, ప్రశాంత్‌గౌడ్, సర్పంచ్‌లు అయ్యమ్మ, రాజమ్మ, గోవర్ధన్‌రెడ్డి, మధునాయుడు, ఎంపిటిసిలు తిరుపిరెడ్డి, కేశన్న, ఆయా గ్రామాల విఆర్ఎలు పాల్గొనగా ఇంటి స్థలాలు రానివారు ఆందోళన చేసే అవకాశం ఉంటుందనే ముందస్తు సమాచారంతో అలంపూర్ సిఐ రాజు, ఎస్సైలు అశోక్‌బాబు, కృష్ణదేవ ఆధ్వర్యంలో ఆయా పోలీస్ స్టేషన్ల పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

## పాత పెన్షన్ సాధన రథయాత్రకు బ్రహ్మరథం పట్టండి..!

**జలసౌధ ఉద్యోగులతో పోస్టర్లు ఆవిష్కరించిన సనాతన బాలస్వామి**



ఉద్యోగులతో కలిసి పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సనాతన బాలస్వామి

**మహబూబ్‌నగర్ బ్యూరో,జులై 21 ప్రభాతవార్త:** ఉద్యోగ, ఉపాధ్యాయులకు సిపిఎస్ నూతన పెన్షన్ విధానానికి రాష్ట్ర ప్రభుత్వం స్వస్తి చెప్పి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ సాధన రథయాత్ర తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల్లో యానతను కొనసాగిస్తోందని సిపిఎస్ ఈయూ ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు సనాతన బాలస్వామి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన జిల్లా జలసౌధలో ఉద్యోగులతో కలిసి పాత పెన్షన్ సాధన రథయాత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలస్వామి మాట్లాడుతూ రథయాత్ర ఈనెల 16న జోగులాంబ గద్వాల జిల్లా నుండి ఆరంభమై 30న మహబూబ్‌నగర్ జిల్లాకు చేరుకుంటుందని, 31న యాదాద్రిలో ముగుస్తుందని తెలిపారు.జిల్లాకు ఈనెల30న చేరుకునే రథయాత్రకు జిల్లా ఉద్యోగ, ఉపాధ్యాయులు బ్రహ్మరథం పట్టాలని కోరారు. ఉమ్మడి జిల్లాల ఉద్యోగ, ఉపాధ్యాయులు పాత పెన్షన్ సాధించుకునేంత వరకు కలిసికట్టుగా పోరాడి సాధించుకోవాలని సనాతన బాలస్వామి కోరారు.

## స్వీపర్ల డిమాండ్లను నెరవేర్చాలి



**వనపర్తి టౌన్,జూలై21,ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా కేంద్రంలో పది రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న స్వీపర్ల డిమాండ్లను వెంటనే నెరవేర్చఆలని సీఐటీయు, ఐఎఫ్‌టీయు నాయకులు డిమాండ్ చేశారు. వనపర్తి కలెక్టర్ కార్యాలయం సమీపంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపట్టిన స్వీపర్ల రిలే నిరాహార దీక్షలో పాల్గొని వారి పోరాటానికి మద్దతు తెలిపి మాట్లాడారు. నెలకు రూ. 1623 , రూ. 4వేలు వేతనం ఇస్తు ప్రభుత్వం స్వీపర్ల శ్రమ దోపిడీ చేస్తుందని దుయ్యబట్టారు. కనీస వేతనం రూ.278వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత ,రెగ్యులరైజ్‌కు చర్యలు తీసుకోవాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.15 లక్షలు ఇవ్వాలని,చనిపోయిన వారికుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు.ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి డిమాండ్లు పరిష్కరించాలన్నారు.ఏఐటీయుసీ జిల్లాకార్యదర్శి మాసన్న, సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ, రాము, ఖయ్యుం, రషీద్, వెంకటయ్య, ముస్తఫా,ముకుంద, శోభరాణిఅక్కమ్మ, నాగమ్మ,సాయమ్మ,బీజన్ బి పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఎవరు కూడా బిఆర్ఎస్ పార్టీలో చేరలేదు

**కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు పూజారి వెంకటయ్య**

**లింగాల,జులై 21 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్యకర్తలు బిఆర్ఎస్ పార్టీలో చేరారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అనడంలో సిగ్గుగా ఉందని కాంగ్రెస్ పార్టీ లింగాల టౌన్ అధ్యక్షులు పూజారి వెంకటయ్య అన్నారు. శుక్రవారం లింగాల మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్యకర్తలు బిఆర్ఎస్ పార్టీలోకి చేరిన విషయాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. ఈసందర్భంగా కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు పూజారి వెంకటయ్య మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీలో చేరిన వారిలో ఇంతకు ముందు నుంచే బిఆర్ఎస్ పార్టీలో పని చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీలోఎప్పుడూకూడా కాంగ్రెస్ పార్టీ జెండా మోసిన దాఖలాలు లేవన్నారు. చేరిన వారిలో కొంత తన స్వలాభం కోసం పార్టీలో చేరారని కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎవరు బిఆర్ఎస్ పార్టీలో చేరలేదని అన్నారు. దీన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగాఖండిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మణ్‌నాయక్, మహిళా అధ్యక్షురాలు ఇందిరమ్మ, తరుణ్, నిరంజన్‌చారి, వెంకటస్వామి పాల్గొన్నారు.

## డీఈవోను కలిసిన మాదిగ ఉద్యోగుల సమాఖ్య, భాష పండితుల సంఘం నాయకులు

**వనపర్తి టౌన్,జూలై21,ప్రభాతవార్త:** కలెక్టర్ కార్యాలయంలో నూతనంగా జిల్లా విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన గోవిందరాజును శుక్రవారం మాదిగ ఉద్యోగుల సమాఖ్య, భాష పండితుల సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువా పూలబొకెతో సన్మానించారు. జిల్లావ్యాప్తంగా ఉన్న విద్యారంగ సమస్యలను త్వరితగతిన పరిష్కరించి ప్రభుత్వ విద్యకు బలం చేకూరే విధంగా చర్యలు తీసుకోవాలని మాదిగ ఉద్యోగుల సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షులు గద్వాల కృష్ణ డీఈవోను కోరారు. ఈ కార్య క్రమంలో ఎస్ఎల్‌టిఎ జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్‌నాథ్, మాదిగ ఉద్యోగుల సమాఖ్య జిల్లా అధ్యక్షులు బోరెల్లి వెంకటయ్య, ఎస్ఎల్‌టిఎ జిల్లా గౌరవ అధ్యక్షులు గిరి రాజాచారి, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా కన్వీనర్ రాజనగరం రాజేష్ మాదిగ, మాదిగ ఉద్యోగుల సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి శిరిన్, మాదిగ ఉద్యోగుల సమాఖ్య జిల్లా నాయకులు రాంబాబు, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

